
ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి సవిత

ఏపీ ఐకాన్.. చంద్రబాబు

బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

అట్టహాసంగా 'అన్నదాత సుఖీభవ' ర్యాలీ

పెనుకొండ టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రానికి ఐకాన్ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండలో సోమవారం నిర్వహించిన 'అన్నదాత సుఖీభవ' విజయోత్సవ ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. వందలాది ట్రాక్టర్లతో టీడీపీ శ్రేణులు, రైతులు పాల్గొన్నారు.సోమందేపల్లి వైజంక్షన్ నుంచి 44వ జాతీయరహదారి మీదుగా పెనుకొండ మార్కెట్ యార్డ్ వరకు ర్యాలీ సాగింది. మంత్రి సవిత 10 కి.మీ. ట్రాక్టర్ నడిపి రైతుల్లో ఉత్తేజాన్ని నింపారు. అన్నదాతల బాగుకోరుకునే ప్రభుత్వం తమదని మంత్రి అన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని, రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది అన్నదాతలకు సొమ్ము అందిందని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీచేస్తున్నామని, ఉచిత ఇసుక, ఉచిత గ్యాస్ సిలెండర్లు, ఉచిత బస్సు, తల్లికి వందనం తదితర పథకాలు అందిస్తున్నామని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు తీసుకొస్తున్నారని అన్నారు. వైసీపీ హయాంలో భ్రష్టుపట్టిన విద్యావ్యవస్థను లోకేశ్ గాడిన పెడుతున్నారని అన్నారు. విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నామని అన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, విత్తనాలు, ఎరువులు అందజేస్తామని అన్నారు. ర్యాలీలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బాలికల భద్రతపై నిర్లక్ష్యం

పాఠశాలల నుంచి అదృశ్యమవుతున్న విద్యార్థినులు

బాధ్యతారహితంగా ప్రధానోపాధ్యాయులు

కనిపించని అవగాహన కార్యక్రమాలు





కదిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో బాలికలకు భద్రత కరువవుతోంది. ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బాలికలను పాఠశాలలకు పంపిన తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. చివరకు తమ పిల్లల జాడ కోసం పాఠశాలల వద్ద ధర్నా చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌ల వరకూ వెళుతున్నారు. పాఠశాలల్లో కనీస భద్రత నిబంధనలు పాటించలేదు. తమ ప్రాంగణంలోకి వచ్చిన విద్యార్థినుల బాధ్యత తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సమాజంలో జరుగుతున్న మోసాల పట్ల అవగాహన లేక కొంతమంది బాలికలు మృగాళ్ల మాయ మాటలకు బలైపోతున్నారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థినులు తిరిగి ఇంటికి వెళ్లే వరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులదే బాధ్యత. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రధానోపాధ్యాయులకు తెలియకుండా బయటకు వెళ్లడానికి వీలు లేదు. అత్యవసర పరిస్థితి ఉంటే తల్లిదండ్రులు అనుమతి ఇస్తేనే విద్యార్థినులు బయటకు వెళ్లడానికి వీలు ఉంటుంది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థినులు అదృశ్యమవుతున్నారు. వీరిలో కొందరు ఇంటికి వస్తే.. మరి కొందరు తిరిగి రాకుండానే వెళ్లిపోతున్నారు. తనకల్లు మండలంలోని ఓ పాఠశాల నుంచి ఈ నెల 5వ తేది సాయంత్రం ఓ బాలిక ఉపాధ్యాయుల అనుమతి లేకుండా బయటకు వెళ్లిపోయింది. తమ బిడ్డ ఆచూకీ తెలపాలని ఆ బాలిక తల్లిదండ్రులు పాఠశాల అధికారిని నిలదీశారు. పాఠశాల ముందు ధర్నాచేశారు. తమ కుమార్తె కనబడక తల్లిదండ్రులు నరకయాతన పడ్డారు. పాఠశాల నుంచి బయటకు వెళ్లిన బాలికను పోలీసులు కనుగొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. బాలికను తీసుకెళ్లిన నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇక్కడ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కనిపిస్తోంది. వారం రోజుల క్రితం ఇద్దరు బాలికలు పట్టణంలోని ఓ పాఠశాలకు ఉదయం వచ్చి పుస్తకాల సంచిని తరగతి గదిలో ఉంచి బయటకు వెళ్లిపోయారు. వారు సాయంత్రం పాఠశాల వదిలే సమయానికి తిరిగి చేరుకున్నారు. విద్యార్థినులు బయటకు వెళ్లిన విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు ఆలస్యంగా గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు వెంటనే పాఠశాలకు చేరుకొని ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు విషయం పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లింది. విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. తమకు తెలిసిన వారందరిని వాకబు చేశారు. సాయంత్రం బాలికలు తిరిగి వచ్చే వరకు తీవ్ర ఆందోళన చెందారు. తనకల్లు మండలంలోని ఓ బాలిక గర్భవతి అయ్యింది. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆ బాలిక మాయ మాటలకు మోసపోయింది. ఎంతో భవిష్యత్తు ఉన్న ఆ బాలిక చదువు ప్రస్తుతం ఇబ్బందుల్లో పడింది.

అప్రమత్తంగా ఉండాలి కదా..?

బాలికల చదువుతున్న పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి. ఈనెల 5న పాఠశాల నుంచి బాలిక బయటకు వెళ్లింది. అక్కడి సిబ్బంది వారిని బయటకు ఎలా అనుమతించారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సాయంత్రం వేళ తల్లిదండ్రులకు సైతం పాఠశాల వద్దకు రావడానికి అనుమతి ఇవ్వరు. బాలికతో మాట్లాడడానికి వచ్చిన వ్యక్తి వారి బంధువే. కుటుంబసభ్యుల ఫొటోలో కూడా ఉన్నట్లు అధికారి చెబుతున్నారు. అయినప్పటికి పాఠశాల నుంచి బయటకు ఎలా పంపారన్నది ప్రశ్నార్థకమవుతోంది. ఆ వ్యక్తి బాలికను ద్విచక్రవాహనం ఎక్కించుకొని తీసుకెళుతుంటే అక్కడి సిబ్బంది ఏమి చేస్తున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. బాలికలు పుస్తకాల సంచి తరగతి గదిలో పెట్టి బయటకు వెళుతుంటే ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఏమి చేస్తున్నారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

అవగాహన కల్పించరా..?

సమాజం పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలతోనే మార్పు వస్తుందని విద్యానిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా విద్యార్థినులకు ప్రస్తుత సమాజ పోకడల పట్ల అవగాహన కల్పించాలని అంటున్నారు. గతంలో పోలీస్ శాఖ పాఠశాలలు, కళాశాలల్లో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేది. గత ఐదు సంవత్సరాలుగా అవి కొనసాగడం లేదు. షీ టీం వంటివి ప్రత్యేకంగా ఉండేవి. కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం అది కొరవడిందనే విమర్శలు ఉన్నాయి.

విచారిస్తాం



పాఠశాల సమయంలో విద్యార్థినులు బయటకు వెళ్లిన సంగతి మా దృష్టికి వచ్చింది. దానిపై ప్ర ధానోపాధ్యాయుడి వివరణ తీసుకొని విచారిస్తాం. అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తాం. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు బయటకు వెళ్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

-కిష్టప్ప, డీఈఓ


చెక్కవారిపల్లి అడవిలోకి వెళ్తున్న పోలీసులు, స్థానికులు

అడవిలో దొంగలు

వలవేసి పట్టుకున్న పోలీసులు

పాణ్యం నుంచి వచ్చి అడవిలో మకాం

చెక్కవారిపల్లి సమీపంలో స్థావరం

ఇన్నాళ్లూ పోలీసులు 'వల'వేసి పట్టుకున్నారు అని పత్రికల్లో చదువుకున్నాం. కానీ నిజంగానే, నిజమైన వలలు వేసి పట్టుకోవడం ఎప్పుడైనా చూశారా..? పాణ్యం, కదిరి పోలీసులు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకునేందుకు నిజంగానే వలలను వినియోగించారు. అటవీ ప్రాంతంలో స్థావరం ఏర్పాటు చేసుకున్నట్లు డ్రోన్ కెమెరాలతో గుర్తించి, అర్ధరాత్రి వ్యూహాత్మకంగా వేటకు వెళ్లారు. కదిరి రూరల్ సీఐ నాగేంద్ర ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్‌ఐలు, 70 మంది కానిస్టేబుళ్లు, 50మంది స్థానిక యువకులు ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్నారు.

విషయం ఏమిటంటే..

నంద్యాల జిల్లా పాణ్యం పట్టణానికి చెందిన ఓ ముఠా తలుపుల మండలం చెక్కవారిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో, తెల్ల గరుగుగుట్టపై స్థావరం ఏర్పాటు చేసుకుంది. ఏపీ సహా పలు రాష్ట్రాల్లో దోపిడీలు, దొంగతనాలు, హత్యలు తదితర నేరాలకు పాల్పడిన ముఠా ఇది. ఇందులో జైలు నుంచి పారిపోయి వచ్చినవారూ ఉన్నారు. ఈ ముఠా సభ్యుల్లో ఒకరు పాణ్యం పోలీసులకు పట్టుబడటంతో గట్టిగా విచారించారు. దీంతో మిగిలినవారు అడవిలో ఉన్నట్లు తేలింది. కరుడుగట్టిన ముఠా కావడంతో పోలీసులు వల పన్ని.. వలలు వేసి మరీ పట్టుకున్నారు.

(వివరాలు మెయిన్‌లో..)

రైతు గోడు పట్టదా..?

- ఆలస్యమవుతున్న పంటల సాగు
- ఇండెంట్ పంపడంలో సిబ్బంది నిర్లక్ష్యం
- వచ్చిన ఎరువులో డీలర్లకే అధిక భాగం
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న కొందరు డీలర్లు
- పలు సొసైటీల్లో సగం మాయం
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు





అనంతపురం అర్బన్/కొత్తచెరువు/బొమ్మనహాళ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కరువు రైతుపై కరుణ కరువైంది. ఓవైపు వర్షాలు పడుతున్నాయి, మరోవైపు హెచ్చెల్సీ నీరు వస్తోంది. వెంటనే వరి నాటుకుందామంటే యూరియా లేదు. రైతు సేవాకేంద్రాలు, సొసైటీల వద్దకెళ్తే స్టాక్ లేదంటున్నారు. ప్రైవేటు డీలర్ల వద్దకెళ్లినా అదే సమాధానమే. అధిక ధర చెల్లిస్తే.. అది కూడా అవసరం లేకున్నా.. వేరే ఎరువులు, పురుగు మందులు కొనాలని షరతులు పెడుతున్నారు. లేదంటే యూరియా లేదంటున్నారు. డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కొన్ని సొసైటీల్లో కూడా యూరియాను సొమ్ము చేసుకుంటున్నాయి. సరఫరా అయిన సగం ఎరువులను రైతులకు పంపిణ చేయకుండా పక్క రాష్ట్రానికి విక్రయించి, జేబులు నింపుకుంటున్నారు.

అదనంగా వసూళ్లు

యూరియా బస్తా (45 కేజీలు) ఎమ్మార్పీ రూ.267. కొందరు డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తూ అదనంగా వసూలు చేస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా బస్తా రూ.300 నుంచి రూ.310 వరకు విక్రయిస్తున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో కొందరు బస్తా రూ.350 నుంచి రూ.400దాకా విక్రయిస్తున్నట్లు సమాచారం. శ్రీసత్యసాయి జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా బస్తా రూ.330 నుంచి రూ.350దాకా విక్రయిస్తున్నట్లు సమాచారం. కొన్ని అన్నదాత, మన గ్రోమోర్ కేంద్రాల్లో యూరియాకు డిమాండ్‌ను సృష్టించి, బస్తా రూ.350 నుంచి రూ.400దాకా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. అంతటితో ఆగకుండా యూరియా కావాలంటే సూక్ష్మపోషకాలు, క్రిమిసంహారక మందులు, బయో ప్రొడక్ట్‌లు తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్న షరతును ప్రైవేటు డీలర్లు విధించినట్లు సమాచారం. యూరియా కోసం తప్పని పరిస్థితుల్లో అవసరం లేకపోయినా ఇతర్రత్రా వాటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. ఇద్దరు హోల్‌సేల్ డీలర్లే అధిక ధరలకు రిటైలర్లకు అంటగడుతున్నట్లు తెలుస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలోని ఓ అధికారితో కుమ్మక్కై తమకే ఎక్కువ శాతం ఎరువులు కేటాయింపులు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. పలు కంపెనీలతో కుమ్మక్కై తమకే అధిక శాతం ఎరువులు పంపేలా చక్రం తిప్పుతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. సూక్ష్మపోషకాలు తీసుకోవాల్సిందేనన్న షరతు విధించినట్లు సమాచారం. సూక్ష్మపోషకాల

(మిగతా 6లో...)

సమస్యలు సకాలంలో పరిష్కరించండి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన అర్జీల పట్ల అలసత్వం వహించకుండా సకాలంలో పరిష్కరించాలని జేసీ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో జేసీ పాల్గొని రెండువందల అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలిచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి లో పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి పడేలా పరిష్కారం చూపించాల న్నారు. ఒక సమస్యపై వచ్చిన ఫిర్యాదు మరోసారి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. భూవివాదాలు, పింఛన్‌లపై అధికంగా అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వ్యవసాయాధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో సత్వర న్యాయం చేయండి

ఎస్పీ రత్న


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చట్టపరిధిలో ఉన్న ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ రత్న తమ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిం చారు. ఫిర్యాదుదారుల నుంచి 65 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు చట్టపరిధిల ఓ సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. కుటుంబ కలహాలు, భూసమస్యలు, ఆర్థిక మోసాలు, ఆస్తి పంపకాలకు సంబంధించిన వివాదాలు, సైబర్‌నేరాలపై ఎక్కువగా ఫిర్యాదులందాయి. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

రాత్రి 12 వరకూ బార్లు

- 1 నుంచి కొత్త బార్ పాలసీ
- ఉమ్మడి జిల్లాలో 30 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 26 వరకు గడువు
- ప్రొహిబిషన్, ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

వివరాలు 7లో...

రోజంతా హై టెన్షన్..

- తాడిపత్రికి బయల్దేరిన పెద్దారెడ్డి
- మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు
- వెనక్కి వెళ్లాలని సూచన
- ససేమిరా అన్న మాజీ ఎమ్మెల్యే
- ఆరుగంటల పాటు
- రోడ్డుపైనే బైఠాయింపు
- ఎట్టకేలకు వెనక్కి
- పంపించిన పోలీసులు

-వివరాలు 7లో..


మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు

ఇక పురంలో వందేభారత్ స్టాప్

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): వందే భారత్ రైలు త్వరలో హిందూపురం రైల్వే స్టేషన్‌లో ఆగనుందని ఎంపీ పార్థసారథి ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇటీవల హిందూపురం ప్రాంతంలోని ప్రజలు వందే భారత్ రైలును రైల్వేస్టేషన్‌లో ఆపేందుకు అనుమతివ్వాలని ఎంపీని కోరారు. ఆయన రైల్వేశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం కేంద్ర రైల్వేశాఖ స్టాప్ చేయడానికి అనుమతిచ్చింది. ఎంతసేపు ఆగాలనేది ఇంకా వెల్లడించాల్సి ఉంది. త్వరలోనే రైల్వేశాఖ మంత్రి సోమన్నతో కలిసి హిందూపురంలో రైలు ఇక్కడి నుంచి ప్రారంభిస్తామని ఎంపీ తెలిపారు.

ఇంకా అక్కడే..!

డిజిటల్ యుగానికి దూరంగా వైద్య కళాశాల

- పాత పద్ధతిలోనే బోధన
- తరగతి నుంచి గ్రంథాలయం వరకూ అంతే..
- కంప్యూటర్లు, ఇంటర్నెట్, వైఫై నిల్
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

6 లో


ఓపీలోని ఇరుకు గదిలో పాఠాలు బోధిస్తున్న ప్రొఫెసర్

నలుగురిని బలిగొన్న నిర్లక్ష్యం

- పదిమందికి తీవ్రగాయాలు
- మండ్లిపల్లి వద్ద టెంపోలు.. ఆర్టీసీ బస్సు ఢీ
- పుణ్యక్షేత్రాలకు వెళ్లి వస్తుండగా విషాదం
- బాధితులు బళ్లారి వాసులు


ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు


అనసూయమ్మ మృతదేహం

స్వస్థలానికి త్వరగా చేరుకోవాలనే ఆత్రం..! ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గమనించకుండా.. ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే ప్రయత్నం..! డ్రైవర్ నిర్లక్ష్యం అతని ప్రాణాలతోపాటు మరో ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. తనకల్లు మండల పరిధిలోని మండ్లిపల్లి వద్ద రెండు టెంపో ట్రావెలర్‌లు, ఆర్టీసీ బస్సు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బళ్లారి జిల్లా కేంద్రానికి చెందిన అనసూయమ్మ(50), జాహ్నవి(4), డ్రైవర్ మణికంఠ(42), నాగేంద్రప్ప(58) మృతిచెందారు. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నామని ఎస్ఐ గోపీ తెలిపారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర రవాణా శాఖమంత్రి రాంప్రసాద్‌రెడ్డి దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. అధికారులను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స చేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

(వివరాలు మెయిన్‌లో..)

అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయం

విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పరిటాల శ్రీరామ్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎస్ రాజు, పరిటాల శ్రీరామ్

రామగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. సోమవారం మండలంలోని గరిమేకలపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్.నారాయణచౌదరి సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున కలశాలతో వచ్చి డప్పులు వాయిస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు అంబేడ్కర్ జీవితాన్ని చదివితే కష్టాలు ఎలా ఉంటాయి, ఉన్నతస్థాయికి ఎలా ఎదగాలనేది తెలుస్తుందన్నారు. అనేక వివక్షలు, అవమానాలు, ఎదురుదెబ్బలను తట్టుకుని ఉన్నత చదువులు చదివారంటే అంబేడ్కర్ శ్రమ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. దళితులు చెరువుల్లో నీటిని తాగకుండా అడ్డుకుంటున్న రోజుల్లో అంబేడ్కర్ మార్గం చూపించారని తెలిపారు. అదే స్ఫూర్తితో వెంకటాపురంలో పరిటాల శ్రీరాములు దళితులకు బావిలో నీరు ఇచ్చి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. పరిటాల కుటుంబానికి దళితులు అండగా నిలిచి వెన్నంటే ఉన్నారని తెలిపారు. అభివృద్ధి గురించి చెప్పాలంటే పరిటాల అనే నాలుగు అక్షరాలు లేకుండా చెప్పలేమని ఎంఎస్ రాజు అన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జేవీవీ జిల్లా కమిటీ ఎన్నిక



కన్నేపల్లి చిత్తప్ప



కెంచాల వీరరాజు

అనంతపురం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని జేవీవీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్ అధ్యక్షతన మొత్తం 41 మందితో కూడిన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కళ్యాణదుర్గానికి చెందిన కన్నేపల్లి చిత్తప్ప, ప్రధాన కార్యదర్శిగా అనంతపురానికి చెందిన కెంచాల వీరరాజు, కోశాధికారిగా మహమ్మద్ జిలాని, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ రంగన్న, డాక్టర్ పి.ప్రసూన, సాకే భాస్కర్, సలహాదారులుగా మల్లికార్జున, వీకే పద్మావతిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రామిరెడ్డి, శివానంద, శశికళ, ప్రసాద్‌రెడ్డి, రాజన్న, నాగరత్న, కార్యదర్శులుగా తిరుపాలు, తిప్పేస్వామి, రాఘవేంద్ర, సింహాద్రి, రంగనాథ్, రామచంద్రయ్యను ఎన్నుకున్నారు.

22న వరిధాన్యం వేలం

కణేకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రంలో పండిన 124 క్వింటాళ్ల స్క్రీన్ రిజెక్షన్ వరి ధాన్యాన్ని ఈ నెల 22వ తేదీన వేలం వేస్తున్నట్లు ఫాం ఏడీఏ నారాయణనాయక్ పేర్కొన్నారు. డీపీటీ 5204, 2846 రకాలకు చెందిన ధాన్యాన్ని అనంతపురంలోని ప్రసన్నాయపల్లిలో ఉన్న ఏపీ సీడ్స్ జిల్లా కేంద్రంలో ఈ వేలం నిర్వహిస్తామని, ఆసక్తిగలవారు ముందుగా రూ.50 వేలు డీడీలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మా ర్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 855 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

21న మాజీ సైనికుల పరిష్కార వేదిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మాజీ సైనికులకు ఈనెల 21వతేదీన అనంతపురంలోని జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో పరిష్కారవేదిక నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి పి. తిమ్మప్ప తెలిపారు. మద్రాస్ రెజిమెంటల్ అధికారులు హాజరై మాజీ సైనికులు, వితంతువుల సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. పార్ట్-11 ఆర్డర్, పెన్షన్ ఇతర సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 08554-241146ను సంప్రదించాలని తెలిపారు.

డీడీఓగా నాగశివలీల

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అనంతపురం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ)గా నాగశివలీల నియమితులయ్యారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న డీడీఓ కార్యాలయంలో సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా మెప్మా పీడీగా ఉన్న నాగశివలీలను డీడీఓ గా నియమించారు. ఇప్పటి వరకు ఉన్న డీడీఓ లీలాభాయ్ బదిలీ కావడంతో ఆ స్థానంలో ఇన్‌చార్జ్‌గా డీఎల్‌పీఓ విజయ్‌కుమార్‌ను నియమించారు. రెగ్యులర్ డీడీఓ రావడంతో ఆయన రిలీవ్ అయ్యారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఏఓగా నాగరాజు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా అకౌంట్స్ అధికారి (డీఏఓ)గా నాగరాజు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ డీఏఓగా ఉన్న మునీంద్ర జూన్ నెలలో ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆ స్థానంలో పీఆర్ పీఐయూ డీఏఓగా ఉన్న పద్మావతికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. దీంతో కర్నూలులో ఏపీఎంఎస్ఐడీసీ మెడికల్ విభాగంలో డీఏఓగా ఉన్న నాగరాజును అనంతపురం ఆర్‌డబ్ల్యూఎస్ డీఏఓగా బదిలీ చేశారు. దీంతో ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

ఇంకా అక్కడే..!



ప్రొజెక్టర్ డిస్‌ప్లే బోర్డు

అనంతపురం వైద్యం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సూపర్ కంప్యూటర్ నుంచి క్వాంటమ్ యుగానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో వైద్య రంగంలో పెనుమార్పులు రానున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒక కణాన్ని పరీక్షించి ఆ వ్యక్తిలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయో తెలుసుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అంటున్నారు. తద్వారా ప్రాణాంతక వ్యాధులను సైతం ఆదిలోనే నివారించే సామర్థ్యాన్ని అందుకోబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో.. తాము మాత్రం నేటికీ పాతపద్ధతిలోనే చదువులు కొనసాగిస్తున్నామని అనంతపురం ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల విద్యార్థులు వాపోతున్నారు. మెడికల్ కాలేజ్, సూపర్ స్పెషాలిటీ, జనరల్ హాస్పిటల్స్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్ వెతికినా కనబడవు. కళాశాలను ఏర్పాటు చేసిన కాలంనాటి పద్ధతిలోనే వసతులున్నాయని మండిపడుతున్నారు.

పాత పద్ధతిలోనే వైద్య కళాశాల

ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలకు త్వరలోనే సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించబోతున్న తరుణంలోనూ అప్‌డేట్ కావడంలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు దశాబ్దాల క్రితంనాటి పుస్తకాలనే చదవాల్సివస్తోందని పేర్కొంటున్నారు. కాలం మారింది, వ్యాధులు రూపాంతరం చెందాయి.. అందుకు తగిన విద్యా వసతులు సమకూర్చడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారని మండిపడుతున్నారు. గ్రంథాలయంలో కంప్యూటర్లు, ఇంటర్నెట్, వైఫై వంటి కనీస సదుపాయాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్యాపకులు వారు చదువుకున్న పాత పద్ధతుల్లోనే బోధిస్తున్నారు. ప్రొజెక్టర్ డిస్‌ప్లేగా వైట్‌బోర్డ్‌ను ఉపయోగిస్తున్నారు. క్లాస్ మధ్యలో ప్రొజెక్టర్లు మొరాయిస్తున్నాయి. పాత పుస్తకాలతో సిలబస్‌లోని అనుమానాలను నివృత్తి చేసుకోవడం కష్టంగా మారింది. దీంతో పుస్తకాలు కొనేందుకు ప్రతి సంవత్సరం రూ.10వేల నుంచి రూ.20వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

డిజిటలైజేషన్‌కు దూరం

వైద్య కళాశాలలో 27 మంది ప్రొఫెసర్లు, 66 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 146 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 14 మంది ట్యూటర్లు ఇలా.. మొత్తం 250 మంది వరకు టీచింగ్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. మొత్తం 44 విభాగాలు ఉన్నాయి. ప్రతి విభాగానికి ప్రత్యేకంగా డిజిటల్ క్లాస్ రూమ్, సెమినార్, రీసెర్చ్ ప్రజెంటేషన్ డిజిటల్ హాల్స్‌ను ఏర్పాటు చేయాలి. ఓపీ, ఐపీ, ఓటీల వారిగా ప్రత్యక్ష శిక్షణతోపాటుగా తరగతి గదులు రూపొందించాలి. ఏ ఒక్క విభాగం డిజిటలైజేషన్ కాలేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

ఎఫ్‌డీపీ నిర్వీర్యం

ప్రస్తుతం మొత్తం 250 మంది వరకు టీచింగ్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. వీరిలో అత్యధిక మందికి డిజిటల్ గాడ్జెట్స్‌ను ఉపయోగించడం తెలియదని విద్యార్థులు చెబుతున్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) విభాగాన్ని నిర్వీర్యం చేయడమే ఇందుకు కారణమని మండిపడుతున్నారు. డిజిటల్ యుటిలైజేషన్‌పై ఫ్యాకల్టీకి ట్రైనింగ్ ఇస్తేనే తగిన విధానంలో బోధిస్తారని పేర్కొంటున్నారు. సమయం దొరికినప్పుడు క్లాస్ తీసుకున్నామా, పాఠాలు పూర్తిచేశామా అన్న ధోరణిలో ఫ్యాకల్టీ వ్యవహరిస్తోందని మండిపడుతున్నారు. డిజిటలైజేషన్‌కు అనుగుణంగా అప్‌డేట్ కావాలన్న ఆకాంక్ష ఫ్యాకల్టీలో లేదనే విమర్శలు వస్తున్నాయి. కళాశాల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి. నిధులను దుర్వినియోగంచేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.



అల్మరాల్లో పాత పుస్తకాలు

అనంత మాకొద్దు..

అనంతపురం మెడికల్ కాలేజ్‌లో తమ పిల్లలను అడ్మిషన్ చేయించాలంటే వెనకడుగు వేయాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆల్ ఇండియా ర్యాంకుల్లో ఉత్తర భారత రాష్ట్రాలు, స్టేట్ ర్యాంకుల్లో ఇతర జిల్లాల్లోని మెడికల్ కాలేజ్‌లను ఎంచుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎక్యూప్‌మెంట్స్, డిజిటల్ క్లాసెస్ తదితర అంశాల్లో అనంతపురం మెడికల్ కాలేజ్ వెనుకబడటంతో వదులు కోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం

డిజిటలైజేషన్ టీచింగ్‌కు అవసరమైన సదుపాయాల వివరాలను ఉన్నతాధికారులకు వివరించాం. కంప్యూటర్ లైబ్రరీ, డిజిటల్ క్లాస్‌బోర్డ్స్, సెమినార్ గ్యాలరీస్ ఇలా అన్నిరకాల అవసరాలను సమకూర్చేందుకు కృషిచేస్తున్నాం. ఇంటర్నెట్, వైఫై కనెక్షన్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి.

-ప్రొఫెసర్ షారోన్ సోనియా, ప్రిన్సిపాల్, వైద్య కళాశాల

రైతు గోడు పట్టదా..?

(5వ పేజీ తరువాయి)

ధరల్లోనూ అదనంగా వసూలు చేస్తుండటం గమనార్హం. శ్రీసత్యసాయి జిల్లాలో ఎరువుల సరఫరా, పంపిణీ వివరాలు గోప్యంగా ఉంచుతుండడం అనుమానాలకు తావిస్తోంది.

సగం మాయం..

ఉమ్మడి అనంత జిల్లాలో సొసైటీలకు సరఫరా చేసిన యూరియాలో సగం మాయం చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అనంత జిల్లాలోని 15 సొసైటీలకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలైదాకా 2,784 మెట్రిక్ టన్నుల యూరియాను ఏపీ మార్క్‌ఫెడ్ యంత్రాంగం సరఫరా చేసింది. సొసైటీల్లో ఎమ్మార్పీకే యూరియా విక్రయాలు చేపడుతుండడంతో ఎక్కువ శాతం మంది రైతులు ఆయా కార్యాలయాల వద్ద యూరియా కోసం క్యూ కడుతున్నారు. ఒక్కో రైతుకు 2 బస్తాల యూరియా మాత్రమే పంపిణీ చేస్తూ సొసైటీ ప్రతినిధులు చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని సొసైటీల ప్రతినిధులు తమకు కేటాయించిన యూరియాలో సగం శాతం కర్ణాటక, ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రైతు సేవా కేంద్రాలకు ఇండెంట్ మేరకు యూరియా సరఫరా చేయలేదు, కొన్ని రైతు సేవాకేంద్రాల నుంచి ఇప్పటిదాకా ఇండెంట్ పెట్టలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల రైతులు యూరియా కష్టాలు ఎదుర్కొంటున్నారు.



బొమ్మనహాళ్ రైతు సేవాకేంద్రం వద్ద యూరియా కోసం వేచివున్న రైతులు (ఫైల్)

వరి నాట్లు ఎలా వేయాలి?



హెచ్చెల్సీ ఆయకట్టు కింద 12 ఎకరాల్లో వరి సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నా. 25 బస్తాల యూరియా అవసరం. సొసైటీలో స్టాక్ లేదని చెబుతున్నారు. రైతు సేవా కేంద్రంలో అడిగినా అదే మాట అంటున్నారు. వరి నాట్లు వేసే సమయంలో యూరియా తప్పనిసరిగా వేయాలి. ఈ తరుణంలో యూరియా ఇవ్వకపోతే ఎలా? బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అది కూడా పలుకుబడి ఉన్నవారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. మాలాంటి సామాన్య రైతులకు యూరియా దొరకడం కష్టమే.

- రైతు శ్రీనివాసులు, బొమ్మనహాళ్

రెండు బస్తాలు ఇస్తే ఎలా..?



27 ఎకరాల్లో వరి సాగు చేయాలనుకున్నా. కనీసం 25 బస్తాల యూరియా అవసరం అవుతుంది. ఒక్కో రైతుకు 2 బస్తాలు మాత్రమే ఇస్తామంటే ఎలా సరిపోతుంది? మిగిలిన యూరియా కోసం ఎక్కడికి వెళ్లాలి. ప్రభుత్వం యూరియా సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలి.

-రైతు బసన్న, బొమ్మనహాళ్

డీసీఎంఎస్ వద్ద తోపులాట



యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ వద్ద సోమవారం రైతుల మధ్య తోపులాట జరిగింది. డీసీఎంఎస్‌లో ఎమ్మార్పీకే యూరియా విక్రయిస్తారు. దీంతో జిల్లాకేంద్రానికి సమీపంలోని మండలాల రైతులు కమలానగర్‌లో ఉన్న డీసీఎంఎస్‌కు వచ్చి కొనుగోలు చేసుకుని, తీసుకెళ్లారు. ఒక్కో రైతుకి మూడు యూరియా బస్తాలు ఇస్తారు. సుమారు 8 లోడులు వస్తే సర్దుబాటు చేయొచ్చు. సోమవారం 280 బస్తాలు ఉండే ఒక లారీ లోడు వచ్చింది. 600మందికిపైగా రైతులు డీసీఎంఎస్‌కు చేరుకున్నారు. యూరియా కోసం రైతుల క్యూ చాంతాడంత కనిపించింది. యూరియా దొరుకుతుందో, లేదోనని రైతులు ఎగబడడంతో తోపులాట జరిగింది. డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మేనేజర్ విజయ్‌భాస్కర్ జోక్యం చేసుకుని, విషయం పోలీసులకు చేరవేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేసేందుకు కృషి చేస్తామని డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

యూరియా ఇతర అవసరాలకు

వాడితే చర్యలు: కలెక్టర్



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యూరియా వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం యూరియాపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాకు ఈ ఏడాది ఖరీఫ్‌లో 26,839 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, మొత్తం 29,527 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందన్నారు. అందులో 26,008 మెట్రిక్ టన్నులు విక్రయించగా, ఇంకా 3,519 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో యూరియా వినియోగంపై డీఎస్‌ఓ, ఇండస్ట్రీస్, లేబర్, ఎక్సైజ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, డీటీసీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్, అగ్రికల్చర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయానికి కాకుండా వేరేదానికి ఉపయోగించారా అన్నదానిపై తనిఖీలు చేసి, 48 గంటల్లో నివేదిక ఇవ్వాలన్నారు. ఎంత యూరియా కేటాయించారు, ఎంత పంపిణీ చేశారన్న వివరాలపై నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల, ఎఫ్ఎస్‌ఓ రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జునుడు, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ, డీటీసీ వీర్రాజు, పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌హెచ్ 544డి పనులను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్ 544డి పనులు, ఇతర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... 544డి పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. జిల్లాలో అనంతపురం రూరల్‌లోని సోములదొడ్డి నుంచి ముచ్చుకోట వరకు 37కిలో మీటర్లు, ముచ్చుకోట నుంచి బుగ్గ గ్రామం వరకు 32 కిలోమీటర్లు ఎన్‌హెచ్ 544డి పనులను చేపడుతున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూసేకరణకు సంబంధించి వారానికి ఒకసారి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ మలోల, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, ఎన్‌హెచ్ పీడీ తరుణ్‌కుమార్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పురోగతి తీసుకురావాలి

ఉపాధి హామీ పథకం పనుల్లో కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా పురోగతి తీసుకురావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం పనులు, హౌసింగ్, తదితరఅంశాలపై డ్వామా పీడీ, హౌసింగ్ పీడీ, ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపీఎంలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్ల పెండింగ్‌ను వెనుకబడిన మండలాలు పూర్తి చేయాలన్నారు. వివిధ అంశాల్లో కేటాయించిన లక్ష్యానికన్నా పురోగతి తక్కువగా ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ కింద జిల్లాకు కేటాయించిన ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. వీసీలో డ్వామా పీడీ సలీమ్‌బాషా, హౌసింగ్ పీడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగి ఆత్మహత్య

నేత్రదానం చేయించిన తల్లిదండ్రులు



ప్రకాష్‌నాయుడు (ఫైల్)

తాడిమర్రి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకొండయ్యపల్లికి చెందిన ప్రకాశ్‌నాయుడు (22)అనే బీటెక్ చదివిన నిరుద్యోగి ఆదివారం రాత్రి అనంతపురంలో ఆత్మహత్య చేసుకున్నాడు. చిల్లకొండయ్యపల్లికి చెందిన మనోహర్‌నాయుడు, రమణమ్మ కుమారుడు ప్రకాశ్‌నాయుడు నరసరావుపేటలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏడాది క్రితం బీటెక్ పూర్తిచేశాడు. అప్పటి నుంచి అనంతపురంలో ఉంటూ ఉద్యోగం ప్రయత్నం చేస్తున్నా దొరకలేదు. దీంతో మనస్థాపానికి గురై ఆదివారం రాత్రి అనంతపురంలో ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడి నేత్రాలను దానం చేసి మరొక ఇద్దరికి కంటిచూపు ప్రసాదించాలని నిర్ణయించుకుని ప్రకాశ్‌నాయుడు నేత్రాలను దానం చేశారు.

స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): దీనదయాల్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న.. గత యేడాది 60శాతం ఉత్తీర్ణత సాధించినవారు సెప్టెంబరు 16లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్కూల్ ద్వారాగాని, రూ.200 అకౌంట్ డిపాజిట్‌ను తపాలా కార్యాలయంలో చేసి ఓ అప్లికేషన్‌ను కవర్లో జతచేసి హిందూపురం, ధర్మవరం తపాలా కార్యాలయాలకు పంపవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు రెండు విభాగాల్లో ఉత్తీర్ణత సాధిస్తే ఏడాదికి రూ.6వేలు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. వివరాలకు తపాలా కార్యాలయాలను సంప్రదించాలన్నారు.

మహిళా క్రికెట్ టోర్నీ విజేత చిత్తూరు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీనియర్ మహిళల సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ విజేతగా చిత్తూరు జట్టు నిలవగా, ద్వితీయ స్థానంలో అనంతపురం జట్టు నిలిచింది. సోమవారం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీలు నిర్వహించారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కడప, చిత్తూరు మధ్య జట్ల పోరులో...మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసింది. బ్యాటర్ శిరీషా 50 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 17.2 ఓవర్లలో వికెట్ నష్టానికి లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. 9వికెట్ల తేడాతో గెలుపొందిన చిత్తూరు ట్రోఫీని కైవసం చేసుకుంది. శుభశ్రీ 54 పరుగులు, హంస 23 పరుగులు చేశారు. మొదటి స్థానంలో చిత్తూరు, అనంతపురం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏసీఏ సెలెక్టర్ ధనలక్ష్మి, జోన్ సెలెక్టర్లు రాధిక, వేదవల్లి, నాగమణి, అనూషా, హరీషా పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

అనంతపురం విద్య, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 23 నుంచి నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని శ్రేణులకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాఫర్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి 500 మంది జనసేవదళ్ రెడ్‌షర్ట్ వాలంటీర్లు ప్రత్యేకంగా పాల్గొంటున్నారని తెలిపారు. మరో 63 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని వివరించారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులు దారుణంగా, ప్రమాదకరంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం మతోన్మాద అజెండాతో ముందుకు సాగుతోందని, ఇది ప్రజాస్వామ్యానికే ముప్పు అన్నారు. జగన్, చంద్రబాబుకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కులేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, శ్రీరాములు, కేశవరెడ్డి, లింగమయ్య, పద్మావతి, సంతోష్‌కుమార్, రాజేష్‌కృష్ణుడు, రమణ, రంగయ్య, నాగరాజు, చిరంజీవి, అల్లీపీరా, రాము పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకూ ముఖ హాజరు..!

త్వరలో కొత్త యాప్.. మాన్యువల్ మస్టర్లకు చెల్లు

అంతా.. ఆన్‌లైన్‌లోనే.. అక్రమాలకు చెక్ పడేనా?

కొత్తచెరువు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అంతేలేదన్నది బహిరంగ రహస్యమే. గతంలో చేసిన పనులకే మళ్లీ బిల్లులు పెట్టుకుంటారు, పనులకు వెళ్లకున్నా కూలీలను నమోదు చేస్తారు, ఒకరి జాబ్‌కార్డుపై మరొకరు పనులకెళ్లారు.. ఇలా.. ఎన్నెన్నో మాయలు. ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఉపాధి కూలీలకు కూడా ముఖ హాజరు నమోదు చేయనున్నారు. అది కూడా.. పనిచేసే ప్రదేశంలో రెండుపూటలా ముఖ హాజరు వేయనున్నారు. అది కూడా.. లొకేషన్ జియో ట్యాగింగ్ చేస్తారు. దీంతో బోగస్ కూలీలకు చెక్ పెడనుంది. ఆన్‌లైన్ హాజరు మేరకు నేరుగా కూలీల ఖాతాలకు ఉపాధి కూలీ సొమ్ము జమవుతుంది. మాన్యువల్ మస్టర్లు ఉండవన్న మాట. దీంతో మస్టర్లలో ఇష్టారాజ్యానికి చెక్ పెడనుందని డ్వామా వర్గాలు పేర్కొంటున్నాయి. అక్రమాలకు చెక్ పెట్టడమే లక్ష్యమంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) యాప్‌ను మరింత పటిష్టం చేయనున్నారు. ఆ దిశగా కూలీల బ్యాంకు ఖాతా వివరాలు సేకరించే పనిలో పడ్డారు. త్వరలోనే యాప్ అమలులోకి రానుందని తెలుస్తోంది.

అమలు ఇలా..

జిల్లాలో మెత్తం 2,78,454 జాబ్ కార్డులు ఉన్నాయి. కొత్త యాప్ అమలులోకి వస్తే.. ఫీల్డ్ అసిస్టెంట్లు తమ స్మార్ట్ ఫోన్లను ఉపయోగించి ఉపాధి పని ప్రారంభం, ముగింపు సమయాల్లో రోజూ కూలీల ముఖ హాజరు నమోదు చేస్తారు. దీంతో మాన్యువల్ అటెండెన్స్‌కు చెక్ పడనుంది. తద్వారా ఉపాధి పనుల్లో అవకతవకలతో పాటు బినామీలకు అరికట్టే అవకాశం ఉంటుంది. ఈ యాప్ అమలు దిశగా ఇప్పటికే కూలీలకు మండల కంప్యూటర్ సెంటర్‌లో ఆధార్ కార్డు ప్రకారం, బ్యాంకు అకౌంట్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తవగానే యాప్‌ను అమలులోకి తేనున్నట్లు ఉపాధి పథకం సిబ్బంది తెలియజేస్తున్నారు.

నెట్‌వర్క్ సమస్యగా మారనుందా?

ఎన్ఎంఎంఎస్ యాప్ అమలులో నెట్‌వర్క్ సమస్య తలెత్తే అవకాశం ఉందని డ్వామా అధికారులు పేర్కొంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా లేకపోతే ఈ యాప్ పనిచేయదనీ, దీంతో సిబ్బంది, కూలీలకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

యాప్‌తో అక్రమాలకు చెక్



కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు ఎన్ఎంఎంఎస్ యాప్‌ను త్వరలో అమలు చేయనుంది. మస్టర్లలో బోగస్ కూలీల ఎంట్రీలు తగ్గుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఇకరి బదులు మరొకరు పనిచేసుకునే అవకాశాలున్నాయి. వాటికి చెక్ పెట్టేందుకే ఈ యాప్‌ను తీసుకొస్తోంది. జాబ్‌కార్డులో ఎవరు ఉంటే వారే పనికి వెళ్లాల్సి ఉంటుంది.

-విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువరైతు మృతి


సందీప్‌రెడ్డి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటంపల్లిలో సోమవారం విద్యుదాఘాతానికి గురై ఓ యువరైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రత్నమ్మ, చంద్రారెడ్డి దంపతుల రెండో కుమారుడు ఖైలారపు సందీప్ రెడ్డి(36) అనే యువ రైతు తన వ్యవసాయ తోటలో పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. స్టార్టర్ పెట్టె వద్దకు వెళ్లి మోటారు ఆన్‌చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలం వద్ద విగతజీవిగా పడి ఉన్న సందీప్‌రెడ్డి మృతదేహంపై పడి భార్య మౌనిక, తల్లి రత్నమ్మ రోదించిన తీరు అక్కడున్న వారిని కంట తడి పెట్టించింది. ఘటనతో వెంకటంపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ట

చేనేత కార్మికుడి ఆత్మహత్య

లేపాక్షి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో చేనేత కార్మికుడు లక్ష్మీపతి(32) సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన మేరకు బయన్నపల్లి గ్రామానికి చెందిన ఆదెప్ప కుమారుడు లక్ష్మీపతి గత కొన్నేళ్లుగా లేపాక్షిలో సొంత ఇల్లు నిర్మించుకుని చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఇతడు గత కొన్నేళ్ల నుంచి తీవ్రమైన తలనొప్పితో బాధపడుతుండేవాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున ఇంట్లో భార్య నిద్రిస్తుండగా హాల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కాసేపటి తర్వాత నిద్ర లేచిన భార్య ఉరికి వేలాడుతున్న భర్తను చూసి గట్టిగా కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కలవారు అక్కడకు వచ్చి ఉరికి వేలాడుతున్న లక్ష్మీపతిని కిందికి దించి పరిశీలించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి నాలుగు నెలల కుమార్తె ఉంది. మృతుడి తండ్రి ఆదెప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరిశ్రమలో కార్మికుడి మృతి

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గోళ్లాపురం పారిశ్రామికవాడలోని ఓ స్టీల్ పరిశ్రమలో కార్మికుడు దుర్మరణం చెందాడు. శంభుపాశ్వా(40)అనే కార్మికుడు విధుల్లో ఉండగా సోమవారం ప్రమాదవశాత్తు ఇనుపరాడ్ శరీరంలో దూరింది. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పరిశ్రమ యాజమాన్యం ఈ ప్రమాదంపై గోప్యంగా ఉంచింది. దీనిపై అప్‌గ్రేడ్ సీఐ అంజనేయులును వివరణ కోరగా.. ప్రమాదం జరిగి కార్మికుడు మృతిచెందాడని, దీనిపై దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు.

టీచర్ల ఖాళీల వివరాల సేకరణ

అనంతపురం విద్య, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాలలో భాగంగా ఖాళీ పోస్టుల వివరాలను విద్యాశాఖ పక్కాగా సేకరిస్తోంది. ఆయా మండలాలు, పాఠశాలలో ఏఏ సబ్జెక్టులు, ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి, ఇటీవల బదిలీ అయినా రిలీవర్ లేక అదే పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు, ఒక్క టీచర్ లేని పాఠశాలలు, సబ్జెక్టు టీచర్లు లేని ఉన్నత పాఠశాలల సమాచారాన్ని సేకరించింది. వీటి వివరాలను పక్కాగా అందించాలని ఆయా మండలాల ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను ఉదయం అనంతపురం డివిజన్, మధ్యాహ్నం గుత్తి డివిజన్‌ల వారిగా జిల్లా సైన్స్‌సెంటర్‌కు ఆహ్వానించారు. అక్కడ డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్, ఐటీ సెల్ చంద్రశేఖరరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి ఎంఈఓలు,హెచ్‌ఎంల నుంచి టీచర్ల ఖాళీల వివరాలను స్వీకరించారు. అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో ఖాళీల వివరాలు నమోదు చేయిస్తూ ఉన్న పోస్టులకు.. ఎంఈఓలు, హెచ్‌ఎంలు ఇచ్చిన వివరాలకు సరిపోయాయా లేదా అని పరిశీలిస్తున్నారు. డీఎస్సీ నియామకాలకు ఖాళీల వివాదం తలెత్తకుండా విద్యాశాఖ ముందస్తు చర్యలు తీసుకుంటోంది.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం విద్య, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష సూపరింటెండెంట్‌గా కృష్ణారావు బాధ్యతలు స్వీకరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న కారణంతో ఇదివరకు ఉన్న సూపరింటెండెంట్ ఇక్బాల్‌మహ్మద్‌ను ఏపీసీ శైలజ ఇటీవల ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో చిత్తూరు జిల్లా సమగ్రశిక్షలో పని చేస్తున్న కృష్ణారావును అనంతపురం జిల్లాకు నియమిస్తూ ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొత్త సూపరింటెండెంట్‌కు సమగ్రశిక్షలో పనిచేస్తున్న సిబ్బంది అభినందనలు తెలిపారు.

30 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 30 మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. అత్యధికంగా కుందుర్పిలో 19.6 మి.మీ వర్షపాతం నమోదైంది. డి. హిరేహాళ్, తాడిపత్రిలో 15.2, బెళుగుప్ప 13.8, బొమ్మనహాల్ 10.6, రాయదుర్గం 10.2, కంబదూరు 9.2, పెద్దవడుగూరు 8.8, గార్లదిన్నె 8.6, గుత్తి, యాడికి 8.2, కళ్యాణదుర్గం 8.0, శింగనమల 7.2, విడపనకల్లు, యల్లనూరు 6.8, నార్పల 6.4, ఉరవకొండ 6.2, బ్రహ్మసముద్రం 6.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతామండలాల్లో 5.6 మి.మీలోపు వర్షపాతం నమోదైంది. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం పడింది. అనంతపురం,యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

టమోటా కిలో రూ.47

అనంతపురం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠ ధర రూ.27తో, సరాసరి ధర రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

తాడిపత్రి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చింతల వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయంలో కమిటీ సభ్యులు, అర్చకులుతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాలను సజావుగా నిర్వహించడానికి సూచనలు ఇవ్వాలని కోరారు.

చిత్రం.. సిత్రం..!


ఓ తుంటరి తూనీగా..! నీకే రెక్కలున్నట్లు..!
ఎక్కడెక్కడో తిరిగి.. అలసి ఇక్కడికి వచ్చావు ?
ఎముందని ఎండిన కొమ్మపై వాలావు


రంగు .. రంగు
రెక్కల
సీతాకోక చిలుకా
మకరందపు
మాధుర్యం చూడగ
వచ్చావా..!
మా ఇంటిదాకా..


సూడు సూడు... ఈయప్ప
నేనొగదాన్ని ఉండానని కూడా పట్టించుకోకుండా
సిక్కింది మిడతని గబగబా గొంతులేకి ఏసుకుంటాడు..!


థూ..యాల్రా నాదాంట్లేకి వచ్చిండావు
ఆడ.. యాడా పెట్లేదా బువ్వ.. ఈటికొచ్చినావు
సిత్రాన్నం కమ్మగుంది నేనొగడే తిన్నళ్ల.. పోలే అక్కడ

జ్ఞాపకాల దొంతర ఫొటో..
మది చెదిరిన
బాధలు, బంధాలు,
ఆనందాలు, అద్భుతాలు
వినోదాలు, విషాదాలు
గుర్తు చేసే సజీవ సాక్ష్యం ఫొటో
తీపి చేదుల మాధుర్యాన్ని
మనసు పొరలకు అందిస్తూ
కాలగమనాన్ని కాసేపు ఆపే వి'చిత్రం' అది
కాలం మారినా కరిగిపోని వసంతమై
చిగురించిన చైత్రంలా మనసును
బంధించే చిత్తరువు నిత్యనూతనం

నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే


ఏమన్నా.. ఇన్నాళ్లకు మనుసుకొస్తినా..?
ఓహో. మంగళారం ఫొటోగ్రఫీ డే కదా..
అందుకే మతికివచ్చుంటా
సరేసర్లే ఫొటో మట్టంగ తియ్.. పిల్ల మామా అనల్ల

స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి.

రోజంతా హై టెన్షన్..

- తాడిపత్రికి బయల్దేరిన పెద్దారెడ్డి
- మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు
- వెనక్కి వెళ్లాలని సూచన
- ససేమిరా అన్న మాజీ ఎమ్మెల్యే
- ఆరుగంటల పాటు రోడ్డుపైనే బైఠాయింపు
- ఎట్టకేలకు వెనక్కి పంపించిన పోలీసులు


డీఎస్పీతో పెద్దారెడ్డి వాగ్వాదం

తాడిపత్రి/పుట్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి నియోజకవర్గంలో రోజంతా హైటెన్షన్ నడిచింది. తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం బయల్దేరడంతో పట్టణ వాసుల్లో ఆందోళన నెలకొంది. పట్టణంలో ధ్యానశివుడి విగ్రహావిష్కరణకు మున్సిపల్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీ సంఖ్యలో గుమికూడారు. అదే సమయంలో పెద్దారెడ్డి పట్టణానికి వస్తుండడంతో ఎప్పుడు, ఏం జరుగుతుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దారి మధ్యలోనే పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో ఆయన అక్కడే ఆరుగంటలపాటు బైఠాయించారు. ఎట్టకేలకు సాయంత్రం ఆయనను పోలీసులు వెనక్కి పంపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్నికల సమయం నుంచి..

గతేడాది ఎన్నికల సమయం నుంచి పెద్దారెడ్డి తాడిపత్రికి దూరంగా ఉంటున్నారు. ఆయనను రానివ్వమని జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి పలు మార్లు తాడిపత్రికి రావాలని ప్రయత్నించినా.. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు అడ్డుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి.. హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో సోమవారం మరోసారి తాడిపత్రికి వెళ్తున్నట్లు ప్రకటించారు. ఇదేరోజే జేసీ ప్రభాకర్ రెడ్డి పట్టణంలోని అనంతపురం రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపాన ధ్యానశివుడి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు వేలాదిగా టీడీపీ శ్రేణులు, ఆయన అనుచరులు హాజరయ్యారు.


పెద్దారెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు

అడ్డుకున్న పోలీసులు

పెద్దారెడ్డి యల్లనూరు మండలంలోని స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి అనుచరులతో కలిసి బయల్దేరారు. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందంటూ పుట్లూరు మండలంలోని నారాయణరెడ్డి పల్లి వద్ద పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందనీ, తాడిపత్రికి అనుమతించబోమని చెప్పారు. కోర్టు అనుమతితో వెళ్తున్నాననీ, అడ్డుకోవడం ఏమిటంటూ పోలీసులతో పెద్దారెడ్డి వాగ్వాదం చేశాడు. అక్కడే రోడ్డుపై బైఠాయించారు. ఆరుగంటలపాటు అక్కడే ఉన్నారు. సాయంత్రం 6గంటల సమయంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తిమ్మంపల్లికి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో చేసేదిలేక పెద్దారెడ్డి వెనుదిరిగారు. దీంతో తాడిపత్రి వాసులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

కోర్టు ఆర్డర్ ఉన్నా.. అడ్డుకుంటారా..?


మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులే స్వయంగా తనను తాడిపత్రిలోని ఇంటికి చేర్చాలని హైకోర్టు ఆదేశించినా.. వారే అడ్డుకోవడం ఏంటని మండిపడ్డారు. 16నెలలుగా తనను తాడిపత్రికి వెళ్లనీయలేదన్నారు. 'నా ఇంటికి వెళ్లడానికి నేనేమైనా వేరే దేశంలో ఉన్నానా? వీసా ఏమైనా తీసుకోవాలా?' అంటూ పోలీసులను నిలదీశారు. మళ్లీ కోర్టుకు వెళ్తానన్నారు. అడ్డుకున్న అధికారులు, కక్ష సాధిస్తున్న వారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. పెద్దారెడ్డిని కలవడానికి వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. తాడిపత్రిలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యేను తన ఇంటికి వెళ్లనీయకుండా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఆయనను పోలీసులు బలవంతంగా జీపులో ఎక్కించి పంపించారు.

అక్రమ మైనింగ్‌పై తనిఖీలు

యాడికి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు వద్ద ఒక గనిలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై సోమవారం కర్నూలు జిల్లాకు చెందిన విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. మైనింగ్‌లో జరుగుతున్న అక్రమాలపై నిగ్గు తేల్చడానికి తాడిపత్రి మైన్స్ అండ్ జియాలజీ అధికారులను సంప్రదించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. రాయలచెరువు గ్రామానికి చెందిన ఒక పారిశ్రామిక వేత్తకు మండలంలోని దైవాలమడుగు గ్రామం వద్ద డోలమైట్ గని ఉంది. ఇందులో ఖనిజం తవ్వకాలకు సంబంధించి సీఎఫ్ఓ, సీఎఫ్ఈ కాలపరిమితి ఏడాదిన్నర క్రితం ముగిసినట్లు తెలిసింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద విజిలెన్స్ అధికారుల తనిఖీ బయటపడినట్లు తెలిసింది. దీనిపై నిగ్గుతేల్చడానికి సోమవారం కర్నూలు నుంచి విజిలెన్స్ అధికారులు వచ్చారని తెలిసింది. వర్షం పడుతుండడంతో మైనింగ్ ప్రాంతం వద్ద నుంచి అధికారులు వెనక్కి వచ్చినట్లు తెలిసింది.

రాత్రి 12 వరకూ బార్లు

- 1 నుంచి కొత్త బార్ పాలసీ
- ఉమ్మడి జిల్లాలో 30 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 26 వరకు గడువు
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య



అనంతపురం క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కొత్త బార్ పాలసీ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలవుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. సోమవారం అనంతపురంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఇతర అధికారులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ నాగమద్దయ్య మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం 2025-2028 సంవత్సరాలకు కొత్త బార్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆ మేరకు బార్ల లైసెన్సుల కోసం సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అనంతపురం జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్‌లో 9 బార్లు, గుంతకల్లులో 3, తాడిపత్రిలో 4, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గంలో ఒకటి చొప్పున బార్లు ఉన్నాయని, సత్యసాయి జిల్లాలో హిందూపురంలో 3, ధర్మవరంలో 3, కదిరిలో 3, పెనుకొండ, మడకశిరలో ఒకటి చొప్పున ఉన్నాయని వివరించారు. మొత్తం 30 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గతంలో బార్లను వేలం పద్ధతిలో కేటాయించే వారని, ప్రస్తుతం లాటరీ డ్రా విధానంలో కేటాయిస్తామని అన్నారు. 2022-25 బార్ పాలసీలో జనాభా స్లాబ్ మేరకు బార్లకు దరఖాస్తు ఫీజు రూ. 5 లక్షలు, రూ.7.5 లక్షలు, రూ. 10 లక్షలు ఉండేదన్నారు. కొత్త విధానంలో దరఖాస్తు ఫీజు అన్నింటికి రూ. 5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు నిర్ణయించారని తెలిపారు. పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరకాస్తులు రావాలన్న షరతును ప్రభుత్వం విధించిందన్నారు. 50 వేలలోపు జనాభా ఉన్న బార్లకు లైసెన్స్ ఫీజు రూ. 35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న బార్లకు రూ. 55 లక్షలు, 5 లక్షల పైబడిన జనాభా ఉన్న బార్లకు రూ. 75 లక్షల ఫీజును ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గతంలో ఉన్న ఫీజులతో పోలిస్తే భారీగా తగ్గించారని అన్నారు. కొత్త బార్ల నిర్వహణ సమయాన్ని కూడా పెంచారన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ నడపవచ్చు అన్నారు. లైసెన్సు ఫీజును ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చునని తెలిపారు. గతంలో ముందే రెస్టారెంట్ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన ఉండేదని, కొత్త విధానంలో లైసెన్సు వచ్చిన 15 రోజుల వరకు గడువు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్లలో వేయవచ్చు అన్నారు. దరఖాస్తులను రెండు జిల్లాల్లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. 28వ తేదీ లాటరీ డ్రా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అనంతపురం సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


నీటితో కళకళలాడుతున్న పీఏబీఆర్ డ్యాం

పీఏబీఆర్‌కు జలకళ

- డ్యాంలో నాలుగు టీఎంసీల నిల్వ

కూడేరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం) నీటితో కళకళలాడుతుంది. ప్రస్తుతం డ్యాంలో నాలుగు టీఎంసీల నీటి నిల్వ ఉంది. డ్యాంలో నీటి మట్టం గేట్ల వద్దకు చేరడంతో ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డీఈ వెంకటరమణ సోమవారం పరిశీలించారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పీఏబీఆర్ డ్యాంలోకి 1672 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉందని డీఈ వెంకటరమణ తెలి పారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ఫేజ్-2 కాలువకు అధికారులు నీరు వదలడంతో, పీఏబీఆర్ డ్యాంకు వస్తున్న నీరు తగ్గిముఖం పట్టింది. గతంతో 1860 క్యూసెక్కుల నీరు వస్తుండగా, సోమవారం 1672 క్యూసెక్కులకు తగ్గింది. మరో వారం రోజులకు పూర్తిగా తగ్గిపోతుందని అధికారుల ద్వారా తెలిసింది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు తగ్గిపోతే తుంగభద్ర డ్యాం నుంచి వస్తున్న నీటిని లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్ డ్యాంలోకి మళ్లించి ఐదు టీఎంసీలు నిల్వ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో పోలీసుల తనిఖీ


డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మత్తుపదార్థాల రవాణా నియంత్రణ కోసం పోలీసులు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్(18463) రైలులో సోమవారం తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, డాగ్ స్క్వాడ్, ఈగల్ సెల్ పోలీసులు తనిఖీ చేశారు. అనంతపురం నుంచి ధర్మవరం వరకూ ప్రయాణిస్తున్న వారి లగేజీ, టికెట్లు పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించే ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకుని, లగేజీని తనిఖీ చేశారు. డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈగల్ సెల్ ఎస్‌ఐ హనుమంతు, జీఆర్పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్ సీఐ సుధాకర్‌రావు, డాగ్ స్క్వాడ్ చాంద్ బాషా పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

తాడిమర్రి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు మండల కేంద్రంలో సోమవారం మండల కన్వీనర్ కూచి రామ్మోహన్ ఆధ్వర్యంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. మండలంలోని నలుగురికి మొత్తం రూ4,09592 విలువైన చెక్కులను అందజేశారు. టీడీపీ నాయకులు ముంటిమడుగు హర్ష, కునుకుంట్ల శ్రీనివాసరెడ్డి, బద్రి, కుళ్లాయరెడ్డి,రవి నాగేంద్ర, మురళి, గణేశ్ పాల్గొన్నారు.

నేడు పట్టు రైతులకు అవగాహన

ధర్మవరం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని రేగాటిపల్లిలో మంగళవారం 'నా పట్టు- నా అభిమానం' కార్యక్రమంలో భాగంగా పట్టు రైతులకు మల్బరీ సాగుపై అవగాహన కల్పిస్తున్నట్లు ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని పట్టురైతులు హాజరై సలహాలు, సూచనలు పాటించాలని కోరారు.

విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేత

కొత్తచెరువు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు నేవీ ఉద్యోగి శ్రీనివాసులు రూ.10వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని సోమవారం అందజేశారు. పీడీ వెంకటేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

13 మంది బైండోవర్

ముదిగుబ్బ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యోగివేమన రిజర్వాయర్ నుంచి చేపలు పట్టే విషయంలో చేపల సంఘం సభ్యుల మధ్య వివాదం నడుస్తున్న నేపథ్యంలో ఇరువర్గాలకు చెందిన 13 మందిని బైండవర్ చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా సోమవారం తహసీల్దార్ నారాయణస్వామి ఎదుట హాజరు పరచినట్లు తెలిపారు.

శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

ముదిగుబ్బ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం శివారులో ముస్లిం శ్మశాన వాటిక నిర్మాణానికి సోమవారం స్థానిక జామియా మసీదు ట్రస్ట్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు భూమి పూజ చేశారు. శ్మశాన వాటికకు సొంత నిధులతో బోరు, మోటార్ ఏర్పాటు చేయిస్తానని టీడీపీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్ హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు తుమ్మల మనోహర్, కోట్ల బాబి, జామియా మసీద్ ట్రస్ట్ ప్రెసిడెంట్ అమీర్ తదితరులు పాల్గొన్నారు.

సుంకులమ్మ ఆలయంలో చోరీ



చెరువుకట్టపై నిర్మిస్తున్న సుంకులమ్మ ఆలయం

ధర్మవరం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి):. స్థానిక చెరువు కట్టపై నూతనంగా నిర్మిస్తున్న సుంకులమ్మ ఆలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. చెరువుకట్టపై నూతనంగా నిర్మిస్తున్న సుంకలమ్మ ఆలయంలోనూ పూజారి శ్రీరాములు ఉంటూ పూజలు నిర్వ హించేవాడు. అతడు ఆదివారం సాయంత్రం మార్కెట్ పని మీద ఇంటికి వచ్చాడు. రాత్రి గుర్తుతెలియని దొంగలు ఆలయంలో ఉన్న 14 తులాల వెండి సుంకులమ్మ విగ్రహాన్ని దొంగలించారు. సోమవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి ఆలయంలో దొంగతనం జరిగిన్న విషయా న్ని గుర్తించి సాయంత్రం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎనిమిది మంది నిందితుల అరెస్ట్

నల్లమాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఈ నెల 16న జరిగిన ఘర్షణకు సంబంధించి ఎనిమిది మందిని ఓబుళదేవరచెరువు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ సర్కిల్‌వద్ద అరెస్టు చేసినట్లు సీఐ నరేంద్రరెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 16న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణంలో అదే గ్రామానికి చెందిన డేగల జనార్దన్, గడ్డం తేజేశ్వర్ వర్గాలకు చెందిన వారు రూ.30వేల అప్పు వసూల విషయంలో ఒకరిపై ఒకరు కట్టెలు, కత్తులతో దాడులు చేసుకున్నారన్నారు. ఇరువర్గాలపై హత్యాయత్నం కేసు నమోదు చేశామన్నారు. గడ్డం తేజేశ్వర్, పసుపులేటి ఆనంద్, మలకం ధనుంజయ, తలారి నవదీప్, డేగల జనార్దన్, మల్లెల వినోద్‌కుమార్, ఎరికల నరసిం హయ్య, కొమ్మెల కిషోర్‌ను అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

పోలీసుల అదుపులో వడ్డీ వ్యాపారి?

ధర్మవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోనిశాంతినగర్‌లో చేనేత కార్మికుడు రమణపై ఈనెల 4వ తేదీన వడ్డీ వ్యాపారులు దాడిచేసిన సంఘటన తెలిసిందే. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. దీంతో రమణ ఫిర్యాదు మేరకు ఏడుగురు వడ్డీ వ్యాపారులపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందులో ఏ-1గా ఉన్న ఎర్రగుంట రాజా టూటౌన్ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. మంగళవారం అతడి అరెస్టు చూపడానికి పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది.

వ్యక్తిపై దాడి... ఇద్దరిపై కేసు

ధర్మవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారదానగర్‌లో ఓ వ్యక్తిపై ఇద్దరు దాడిచేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పట్టణంలోని శారదా నగర్‌కు చెందిన బానువత్ చంద్రాయుడునాయక్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పది రోజులుగా ఆ కు టుంబంలో చిన్నపాటి గొడవల నేపథ్యంలో చంద్రాయుడు నాయక్ కుమారుడు చంద్రనాయక్ భార్య రజితాబాయి తండ్రి బాలాజీ నాయక్, తమ్ముడు శ్రీకాంత్‌నాయక్ సోమవారం చంద్రాయుడు నాయక్ ఇంటి వద్దకు వెళ్లారు. ఇష్టానుసారం దుర్భాషలాడుతూ కట్టెలతో దాడిచేయగా, స్థానికులు విడిపించి గాయపడిన చంద్రా యుడు నాయక్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం చంద్రాయుడు నాయక్ ఇచ్చిన పిర్యాదు మేరకు బాలాజీనాయక్, శ్రీకాంత్‌నాయక్‌పై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

దళితుడిపై దాడి.. కేసు నమోదు

బుక్కపట్నం, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన వెంకటరాముడు అనే దళితుడిపై పాముదుర్తి గ్రామానికి చెందిన నారాయణస్వామి అనే వ్యక్తి దాడి చేసి, గాయపరిచినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ క్రిష్ణమూర్తి తెలిపారు. వెంకటరాముడు సోమవారం వ్యక్తిగత పనిమీద అగ్రహారం నుంచి పాముదుర్తికి వెళ్లాడు. తాను స్థానిక హోటల్ లోకి వెళ్లి బంధువులతో మాట్లాడుతుండగా నారాయణస్వామి, అత డి కుమారుడు గోవర్ధన్ దాడిచేసి, కులం పేరుతో దూషించారని వెంకటరాముడు.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు ఈ మేరకు నారాయణస్వామి, గోవర్ధన్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ధర్మవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు మండల పరిధిలోని మైలేపల్లి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరానికి చెందిన టీడీపీ కార్యకర్త మంజునాథ్ మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు ఫణికుమార్, రాళ్లపల్లి షరీఫ్ తదితరులు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మంజునాథ్ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సూచన మేరకు మృతుడి కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా చేనేత ప్రముఖుడు, టీడీపీ నాయకుడు సంధారాఘవ మృతుడి కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

గ్రామ సచివాలయాల్లో ఖాళీ కుర్చీలు

- డెప్యుటేషన్‌పై వెళ్లిన వారు కొందరు
- సమయపాలన పాటించని మరికొందరు
- సేవలు అందక ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కొత్తచెరువు సచివాలయం-3లో ఖాళీగా ఉన్న కుర్చీలు

కొత్తచెరువు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయం-3లో డిజిటల్ అసిస్టెంట్, పంచాయతీ సెక్రటరీ, వెల్ఫేర్‌అసిస్టెంట్, ఏఎన్‌ఎం, మహిళా పోలీసు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన వారు డెప్యుటేషన్‌పై కలెక్టరేట్‌కు, డీపీఓ కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. దీంతో వివిధ పనులపై సచివాలయానికి వచ్చే సంబంధిత సిబ్బంది లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో నాలుగు సచివాలయాలు ఉండగా సోమవారం మూడో సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఏఎన్‌ఎం మహిళా పోలీసు మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇక నాలుగో సచివాలయంలోని వీఆర్‌ఓ రజిత్‌బార్గవ్‌ను ఆర్డీఓ కార్యాలయానికి డెప్యుటేషన్‌పై వేశారు. దీంతో ఆ సచివాలయంలో వీఆర్‌ఓ లేకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిగిలిన వారు హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. సచివాల యాల్లో పనిచేసే వీఆర్‌ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సచివాలయాలకు రాకుండా తహసీల్దార్ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తుండటంతో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. పనులు జరగక అసహనం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా... సచివాలయ ఉద్యోగులు తప్పక సమయ పాలన పాటించాలన్నారు. అలా విధులకు రాకపోతే వారిపై శా ఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తాము కూడా సచివాలయాలను తనిఖీ చేస్తున్నామని ఎక్కడైనా విధులకు హాజరుకాని వారికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. చాలా మంది వీఆర్‌ఓలు సచివాలయా లకు రావడంలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. మూడు, నాలుగు సచివాలయాల వీఆర్వోలను, మూడో సచివాలయంలోని పలువురు సిబ్బందిని ఉన్నతాధికారులు డెప్యుటేషన్‌పై నియమించుకున్నారని తెలిపారు. ఇక్కడి ఇబ్బందులను ఉన్నతాధికారులకు తెలియజేశామని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇదిలాఉండగా సచివాలయం ఎదుటే చెత్తకుప్ప పేరుకుపోయింది. వర్షానికి ఆ చెత్త కుళ్లి పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. సచివాలయానికి వచ్చే ప్రజలు ఆ దుర్వాసనను భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సచివాలయం ఎదుటే ఇలా చెత్త పేరుకుపోతే సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సచివాలయం ఎదుటే ఇలా ఉంటే గ్రామంలో పరిస్థితి ఏమిటని ప్రజలు వాపోతున్నారు.



సచివాలయం-1లో ఇలా...

● నంబులపూలకుంట: మండలంకేంద్రంలోని 1, 2 సచివాలయాల్లో సిబ్బంది సోమవారం హాజరుకాకపోవడంతో, వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. సచివాలయం-2లో వీపీఏ ఒక్కరే ఉన్నారు. సచివాలయం-1లో సిబ్బంది ఎవరూలేరు. ఈ విషయాన్ని డిప్యూటీ ఎంపీడీఓ మాధవరెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా ఆయన 10.50నిమిషాలకు సచివాలయం-1కు వెళ్లి, సిబ్బందిని ఫోన్‌ద్వారా సమాచారం అడిగారు. ఎంపీడీఓ రావడానికి ఐదు నిమిషాల ముందు వెల్ఫేర్ అసిస్టెంట్ ఒక్కరే హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి వేళకు హాజరుకాపోవడంతో మిగిలిన సిబ్బంది సమయ పాలన పాటించడంలేదని గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ఎంపీడీఓ రిజిస్టర్లను పరిశీలించి, ఆరుగురి సంతకాల వద్ద రిమార్క్స్ రాశారు. సెలవుపై వెళ్లి ఉంటే తప్పకుండా సెలవు చీటి ఉండాలని, అనుమతి లేనిదే సెలవు తీసుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమయపాలన పాటించకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు.

కృష్ణా జలాలకు గంగపూజ

తనకల్లు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి క్రాస్ పెట్రోల్ బంక్ వద్ద టీడీపీ ఆధ్వర్యంలో సోమవారం హంద్రీనీవా జలాలకు గంగపూజ చేశారు. చెర్లోపల్లి డ్యామ్ నుంచి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం నీటిని విడుదల చేశారన్నారు. అవి మండలంలో ప్రవేశించడంతో టీడీపీ నాయకులు గంగపూజ నిర్వహించా రు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ సోంపాల్యం నాగభూషణ, మాజీ సర్పంచ్ గోవిందు, పులికంటి నరసింహులు, వేణుగోపాల్ నాయుడు, లక్ష్మణ, పులి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హుల పింఛన్లను పునరుద్ధరించండి

● అధికారులకు టీడీపీ, బీజేపీ నాయకుల వినతి



బత్తలపల్లిలో ఎంపీడీఓతో మాట్లాడుతున్న టీడీపీ, బీజేపీ నాయకులు

బత్తలపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన వారి పింఛన్లను పునరు ద్ధరించాలని టీడీపీ, బీజేపీ నాయకులు ఎంపీడీఓ నరసింహనాయుడును కోరారు. వారు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఎంపీడీఓను కలిశారు. మండల వ్యాప్తంగా విభిన్న ప్రతిభా వంతుల పింఛన్లు తీసుకుంటున్న వారికి ప్రభుత్వం నిర్వహించిన వెరిఫికేషన్‌లో అర్హులైన పలువురి పింఛన్లు కూడా తొలగించారని తెలిపారు. స్పందించిన ఎంపీడీఓ... అర్హులైన వారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు రమణ, వీరనారప్ప, నాగభుషణ, రామచంద్ర పాల్గొన్నారు.

● ముదిగుబ్బ: అర్హత కలిగిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ అధికారులను కోరారు. ఆయన సోమవారం మండలకేంద్రంలో ఎంపీడీఓ నసీమా, ఈఓఆర్డీ దివాకర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అర్హులైన చాలామంది పింఛన్లు అనర్హుల జాబితాలో పడినందున, అధికారులు మరోసారి జాబితాను పరిశీలించాలన్నారు. వెంటనే వారి పింఛన్లను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

● తనకల్లు: మండల వ్యాప్తంగా మూడువందలకుగా పైగా పింఛన్లు తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం, సీపీఎం నాయకులు మాట్లాడుతూ... అధికారులు, ప్రభుత్వాలు మారినప్పుడులా ఇష్టమొచ్చినట్లు వ్యవహరించి, పింఛన్లు తొలిగించడం సరికాదన్నారు. నాయకులు వీవీ రమణ, శివన్న, ఎస్‌వి, రమణ, ఒంటెద్దు వేమన్న, చిన్నవెంకటరమణ, తోపు పారేసు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల దొంగ గద్దె దిగాలి: కాంగ్రెస్



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కదిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఓట్ల దొంగ గద్దె దిగాలి అంటూ సోమవారం కాంగ్రెస్ అధ్వర్యంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు. కదిరిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు కొవొత్తులతో ర్యాలీ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, షాన్‌వాజ్ తదితరులు మాట్లాడుతూ... బీజేపీకి ఎన్నికల కమిషన్ తొత్తుగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఓట్ల విషయంలో బీజేపీ అనేక అనైతిక వ్యవహారాలకు పాల్పడుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మేదర నాగభూషణం, అల్లాబకాష్, జైనుల్లా, గౌస్, నరేంద్ర సుహేల్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి: ఎస్ఎఫ్ఐ

ధర్మవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు నాణ్యంగా అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున తహసీల్దార్ సురేశ్‌బాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ... పలు పాఠశాలల్లో నిర్వాహకులు స్వలాభం కోసం విద్యార్థుల కడుపుకొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. స్పందించిన తహసీల్దార్ పాఠశాలలను పర్యవేక్షిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్, అమాన్, అఖిల్ పాల్గొన్నారు.

మంత్రి చొరవతో వెలిగిన వీధిదీపాలు

ధర్మవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవవీధిలో శనివారం జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రిసత్యకుమార్‌యాదవ్‌కు స్థానికులు వీధిదీపాల సమస్యపై విన్నవించారు. దీంతో స్పందించిన మంత్రి ఆదేశాల మేరకు అధికారులు సోమవారం యాదవవీదిలో కొత్త వీధి దీపాలను ఏర్పాటుచేశారు. కాలనీవాసులు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్డీటీకి అండగా శాంతి ర్యాలీ

నల్లమాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సేవ్ ఆర్డీటీ పేరుతో మండలకేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాల యం వరకు మండల ప్రజలు సోమవారం శాంతి యుత ర్యాలీ నిర్వ హించారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ అనుమతులు రెన్యువల్ చేయాలని డి మాండ్ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రంగనాయకులకు వినతిపత్రం అందించారు. గ్రామస్థులు నారాయణస్వామినాయక్, బుట్టి నాగభూషణనాయుడు, నాగరాజునాయుడు, పొరకల రమణ, ఆదినారాయణరెడ్డి, రాంప్రసాద్‌నాయక్, రాజేంద్రనాయక్, బొజ్జె నాయక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా వెరిఫికేషన్ చేయాలి

● సదరం క్యాంపు వద్ద పింఛన్‌దారుల ఆందోళన

కదిరి అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గంటల కొద్దీ త్వరగా వెరిఫికేషన్ పూర్తి చేయాలని దివ్యాంగ పింఛన్ దారులు సోమవారం స్థానిక ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా పింఛన్లు పంపిణీ చేశారు. అర్హత లేకపోయినా కొంతమంది దివ్యాంగుల పేరుతో ధృవప్రతాలు సంపాదించి పింఛన్లు పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నకిలీ పింఛన్లపై విచారణ చేపట్టింది. సదరమ్ క్యాంపు ద్వారా రీ వెరిఫికేషన్ చేపట్టారు. కదిరి ఏరియా ఆసుపత్రిలో సోమవారం నిర్వహించిన సదరమ్ క్యాంపు వద్దకు రీ వెరిఫికేషన్ కోసం వందలమంది పింఛన్ దారులు వచ్చారు. ఒకే డాక్టర్ పరిశీలిస్తుండడంతో ఇబ్బంది పడిన పింఛన్ దారులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఆసుపత్రి వద్ద



ఆసుపత్రి వద్ద పింఛన్‌దారులతో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

పడిగాపులు కాస్తున్నామని, త్వరగా వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆసుపత్రి సూపరిండెంట్ విజయలక్ష్మి ఆందోళన కారులతో మాట్లాడారు. రోజుకు 40నుంచి 50మాత్రమే చేయగలమని, వందలమంది వస్తే ఒక డాక్టర్‌తో సాధ్యం కాదన్నారు. అధికారుల సమన్వయంతో రోజువారీ టోకన్లు ఇస్తామని, ఏ రోజు టోకన్లు తీసుకున్న వారు ఆ రోజు మాత్రమే రావాలని సూచించారు.

తాగునీటి కోసం ధర్నా



పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

కొత్తచెరువు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బసవన్న కట్టవీధి, పెద్దమసీదు ప్రాంతాల్లో 15 రోజుల నుంచి తాగునీరు సరఫరా కాలేదంటూ ఆ ప్రాంత మహిళలు సోమవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.... తమ ప్రాంతానికి 15 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బం దులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రూ.800 చె ల్లించి ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేస్తున్నామన్నారు. వారానికి ట్యాంకర్ నీరు కావాలంటే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, వచ్చిన డబ్బులను నీటికే చెల్లిస్తే కుటుంబాలు ఎలా గడుస్తాయని వారు పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. నీటి సమస్యను పరిష్కరించాలని పలు మార్లు సర్పంచ్‌కు, అధికారులకు తెలిపినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. దీంతో చేసేదిలేక ధర్నాకు దిగామని వారు తెలిపారు.

కాలనీల్లో మురుగు కాలువలను కూడా శుభ్రంచేయకపోవడంతో ఆ నీరంతా రోడ్లపై ప్రవహిస్తోందన్నారు. అది దుర్వాసన వెదజల్లుతోందన్నారు. అసలే వర్షాకాలం కాలువలను కూడా శుభ్రపరచకపోతే తాము ఇళ్లలో ఎలా ఉండాలని వారు ప్రశ్నించారు.

ఘనంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠ



వినాయకుడు తదితర విగ్రహాలను ప్రతిష్ఠించిన దృశ్యం

ధర్మవరం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల గ్రామంలో సోమవారం పలుదేవతా విగ్రహాల ప్రతిష్ఠను గ్రామపెద్దలు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయకుడు, నాగదేవతలు, నవగ్రహాలు, ఉమామహేశ్వర విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేదపండితుల ఆధ్వర్యంలో యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. పూజ కార్యక్రమాల్లో గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానం చేశారు.

రోడ్డుపై వర్షపు నీటి తొలగింపు

ఆంధ్రజ్యోతి స్పందన

నల్లమాడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటకుంటపల్లిల్లో మలకవేమ ల - ఓడీసీ ప్రధాన రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. 'రోడ్లపై మడుగులు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రి కలో సోమవారం వార్తా కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనానికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఏఎన్ఎం మంజుల అక్కడికి వెళ్లారు. గుంత నుంచి కాలవలు తీయించి నీటిని తరలించారు.

నేతాజీకి ఘన నివాళి

అమడగూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని సోమవారం మండలంలోని లోకోజుపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శివశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

● ధర్మవరం: పట్టణంలోని రిషి విద్యాలయ పాఠశాలలో సోమవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వర్ధంతిని నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ధైర్యసహసాలు, సమయ స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. పాఠశాల డీన్ భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణ్‌స్వరూప్ సింగ్, సీఓఓ రవీంద్ర, ఏఓ రంగారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి సత్యకుమార్ సతీమణి త్రివేణి



గొట్లూరు పాఠశాలలో టాయిలెట్లను ప్రారంభిస్తున్న మంత్రి సతీమణి

ధర్మవరం రూరల్/ బత్తలపల్లి/ముదిగుబ్బ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని మంత్రి సత్యకుమార్ సతీమణి త్రివేణి పేర్కొన్నారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ చొరవతో సంస్మృతి సేవాసంస్థ ఆధ్వర్యంలో, హిందూస్థాన్ కోకాకోలా బేవరేజెస్ కార్పొరేట్ సంస్థ సహకాంతో సీఎస్ఆర్ నిధుల ద్వారా పలు పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన టాయిలెట్లను ఆమె సోమవారం ప్రారంభించారు. ధర్మవరం పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహం, మండలంలోని గొట్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో, బత్తలపల్లిలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, మండలంలోని మాల్యవంతం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ముదిగుబ్బలోని బీసీ బాలికల వసతి గృహం, జిల్లా పరిషత్ బాలి కోన్నత పాఠశాలలో ఈ టాయిలెట్లను నిర్మించారు. మంత్రి సతీమణి వాటిని ప్రారంబించి మాట్లాడుతూ... ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా మంత్రి కార్యాలయంలో తెలియజేయవచ్చని తెలిపారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ నియోజకవర్గ ఇన్ చార్జ్ హరీష్‌బాబు, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ అరుణశ్రీ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ వినయ్ ఆయా మండలాల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి శాఖ

అడిషనల్ సెక్రటరీకి ఘనస్వాగతం

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఒక్క రోజు పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన కేంద్ర గ్రామణాభివృద్ధిశాఖ అడిషనల్ సెక్రటరీ అనిల్‌కుమార్‌కు ప్రశాంతినిలయంలో ఘనస్వాగతం లభించింది. సోమవారం రాత్రి 8.30 గంటలకు ప్రశాంతినిలయం శాంతి భవన్‌కు చేరుకున్న అనిల్‌కుమార్‌కు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయన మంగళవారం గుడిబండ మండలంలోని జంబులబండ, కిరికెర, గుడిబండ గ్రామాల్లో పర్యటించనున్నారు.

కరాటే పోటీల్లో ధర్మవరం విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఆదివారం జరిగిన 43వ యూనివర్సరీ ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ధర్మవరానికి చెందిన మల్టీస్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు సత్తాచాటినట్టు కరాటే మాస్టర్లు ఇనాయత్‌బాషా, నవ్యశ్రీ తెలిపారు. కటాస్, కుమితే విభాగాల్లో ధర్మవరానికి చెందిన 14మంది విద్యార్థులు పాల్గొని 10 బంగారు పతకాలు, రెండు వెండి పతకాలు, ఎనిమిది కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

వైభవంగా శ్రీకృష్ణాష్టమి


శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న యాదవులు

చిలమత్తూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి వేడుకలు మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు మూడు రోజులుగా నిర్వహించారు. చివరి రోజున స్వామి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక రథంపై స్వామి వారిని ఆశీనులను చేసి ఊరేగిస్తూ ప్రజలకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, సోమశేఖర్, నరసింహారెడ్డి, సంధ్యారాణి, రోజ, వీణ, లక్ష్మీనారాయణ యాదవ్, నాగరాజు యాదవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.


స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

గోరంట్ల: పట్టణంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మురళీగానలోలుడి ఊరేగింపు సోమవారం ఘనంగా నిర్వహించారు. గోరంట్లలోని పాత స్టేట్‌బ్యాంక్ వద్ద త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను శనివారం ఏర్పాటు చేశారు. నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ, వేడుకలు జరిపారు. వేణుగోపాలుడి ఉత్సవ విగ్రహాన్ని భక్తులు పల్లకిపై మోస్తూ మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. నిర్వాహకులు వేణుగోపాలయాదవ్, రంగప్ప, నాగలక్ష్మి, మానస, మమత, రూపా, లక్ష్మీనరసప్ప, యాదవసంఘం నాయకులు పాల్గొన్నారు.


జపాన్‌లో కృష్ణాష్టమి వేడుకలు జరుపుకుంటున్న భక్తులు

హిందూపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జపాన్‌లో జరుపుకున్నట్లు ముద్దిరెడ్డిపల్లికి చెందిన ప్రబోధ సేవా సమితి నాయకులు తెలిపారు. జపాన్ దేశంలో శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక జపాన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తెలిపారు. ముద్దిరెడ్డిపల్లికి చెందిన సోమశేఖర్, భార్గవి, పునీత్‌రాజ్, జస్మిత, నోవాటసాన్, ఓయిచాన్, కిరణ్మయి, హరిక్రిష్ణ పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు


అలంకరణలో శంకరుడు

అగళి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పురాతన జడేశంకరేశ్వర స్వామి దేవాలయంలో స్వామికి సుప్రభాత సేవ సహస్రనామార్చన, తైలాభిషేకం, గంధం తదితర పూజలు నిర్వహించారు. గ్రహశాంతిపూజ అర్చకులు శాస్త్రోక్తంగా భక్తులతో చేయించారు. భక్తులు సమర్పించిన పూలతో స్వామివారిని అలంకరించి మహామంగళహారతి, తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. మండల వ్యాప్తంగా మధూడి వీరభద్రేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి, ఇనగలూరు శివాలయంలోనూ, నర్సంబూది శివాలయంలో పూజలు నిర్వహించారు.


మిట్టబండ ఆంజనేయస్వామి

మడకశిర టౌన్: శ్రావణ మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని దేవాలయాల్లో విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణ సమీపంలో మెట్టబండ ఆంజనేయస్వామిని పూలు, ఆకులతో అలంకరించారు. పావగడ రోడ్డులో వెలసిన చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి బిల్వపత్రితో అలంకరించారు. విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అభయాంజనేయస్వామి తదితర దేవాలయాల్లో శ్రావణమాస పూజలు ఘనంగా నిర్వహించారు. భోగి రామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్మీదేవి బసవేశ్వర స్వామికి..


అలంకరణలో స్వామి, అమ్మవార్లు

రొళ్ల: మండలంలోని మల్లినమడుగు గ్రామంలో వెలసిన లక్ష్మీదేవి, బసవేశ్వరస్వామికి శ్రావణసోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూలతో అలంకరణ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఎడగ జాతర


శివుడికి అన్నాభిషేకం

అమరాపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం పూర్వకాలం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం శ్రావణమాసం సోమవారం ఎడగ జాతర ఉత్సవాలను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి తెల్లవారుజామునే అభిషేకం, అర్చనలు, విశేష పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ, కమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహించారు. అనంతరం అన్నంతో పెద్దరాసిని పోసి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాన్ని పంచిపెట్టారు. ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, టీఎన్‌టీయూసీ తాలూకా ఉపాధ్యక్షుడు రామచంద్రప్ప, క్లస్టర్ కన్వీనర్ కృష్ణమూర్తి, పంచాయతీ కన్వీనర్ తిప్పజ్జ, కుమారస్వామి, నరసింహనాయక్, శివకుమార్, లింగరాజు, శ్రీనివాస్‌యాదవ్, మట్టి తిమ్మన్న పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత


నూతన కమిటీ సభ్యులతో మంత్రి సవిత

పెనుకొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. కొత్తగా ఎంపికైన మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మెన్లు, డైరెక్టర్లు, సింగిల్‌విండో అధ్యక్షుల ప్రమాణస్వీకార మహోత్సవాన్ని స్థానిక మార్కెట్‌యార్డ్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సవిత హాజరయ్యారు. పెనుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ బొక్సంపల్లి రామకృష్ణప్ప, డైరెక్టర్ తిరుపాల్‌నాయుడు, ఇతర డైరెక్టర్లు, గోరంట్ల మార్కెట్‌యార్డ్ చైర్మన్ శైలజ వెంకటేశ్, డైరెక్టర్ల చేత కార్యదర్శి బాలాజీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ కొత్తగా ఎంపికైన కమిటీ సభ్యులు బాధ్యతగా పని చేయాలన్నారు. రైతుల సంక్షేమం, మార్కెట్‌యార్డ్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేయాలన్నారు. యార్డు ఆదాయ వనరులు పెంపొందించుకోవ డానికి యార్డులో స్టోర్ కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మించాలని, అందుకోసం ప్రభుత్వం ఒక్కో గోడౌన్ నిర్మించడానికి 50శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. యార్డ్ ముందు స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టాలని ప్రతివారం వారపుసంత నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీలో కష్టపడే ప్రతినాయకుడికి, కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన దానికి ప్రస్తుతం పదవులు పొందినవారే నిదర్శనమన్నారు. నూతన కమిటీ సభ్యులు పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సింగిల్‌విండో సభ్యులు చంద్రగిరి పోతిరెడ్డి, నియోజకవర్గంలోని సింగిల్ విండో అధ్యక్షులకు మంత్రి పూలమాలలు, శాలువ కప్పి సన్మానించారు. నూతన కమిటీ సభ్యులు మంత్రి సవితను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మాధవనాయుడు, కేశవయ్య, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, బీజేపీ నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బైపాస్ రోడ్డు నిర్మాణం


వై జంక్షన్‌లో ట్రాక్టర్ ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: త్వరలో పెనుకొండ నియోజకవర్గం 44వ జాతీయరహదారి బైపాస్ సర్వీస్‌రోడ్డును పూర్తిచేస్తామని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖమంత్రి సవిత అన్నారు. సోమవారం ఆమె ఎన్‌హెచ్ అధికారులతో కలిసి సర్వీసు రోడ్డును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కియ పరిశ్రమ రాకతో పెనుకొండకు రాకపోకలు సాగించేందుకు రోడ్లు రద్దీగా మారాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కూటమి అధికారంలోకి రాగానే సమస్యను కేంద్ర మంత్రి నితిన్‌గట్కారికి విన్నవించినట్లు తెలిపారు. ప్రతిరోజూ పుట్టపర్తి, కొత్తచెరువు, గోరంట్ల మండలాల నుంచి కియ పరిశ్రమకు వాహనాలు వచ్చివెళ్తుంటాయని, ఈ విషయంపై కేంద్రమంత్రికి వివరించగా ఆయన స్పందిస్తూ నిధులు మంజూరు చేశారన్నారు. దీంతో మంత్రి సవిత ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌హెచ్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

మడకశిర రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కదిరేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు నరేష్ కుమార్ సూచించారు. టీడీ పల్లి గ్రామంలో జ్వరాలతో బాధ పడుతున్న రోగులను ఆయన పరిశీలించి వైద్యసేవలు అందించారు. ఆయన మాట్లాడుతూ 10 రోజులగా వర్షాలు కురుస్తుండడంతో రోగాలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. చాల మంది దగ్గ, జలుబు, జర్వాలతో పీహెచ్‌సీకి వస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువగా నీరు నిలబడకుండా చూసుకోవాలన్నారు.

'పరిహారం ఇప్పించి.. ఆదుకోండి'

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తూమకుంట పారిశ్రామిక వాడలోని మీనాక్షి స్టీల్ పరిశ్రమలో జూన్10న బీహార్‌కు చెందిన జిబ్లాన్ యాదవ్ మృతిచెందాడు. ఆ కుటుంబానికి రూ.7.5లక్షలు చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని ఇవ్వలేదు. వెంటనే బాధిత కుటుంబానికి మిగిలిన సొమ్ము అందించాలని పారిశ్రామికవాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులతో కలిసి కార్మికశాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ నాయకులు వినోద్, మారుతిరెడ్డి, సమీవుల్లా పాల్గొన్నారు.

వైభవంగా నిడిగల్ ఉత్సవాలు

పావగడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రెండవ హంపిగా పేరుగాంచిన పావగడ తాలూకా నిడిగల్ ఉత్సవాలు శ్రావణ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలకు నిడిగల్ వాల్మీకి పీఠాధిపతి సంజయ్ కుమార్‌స్వామీజీ ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. ఎందరో రాజులు మహారాజులు పాలేగాళ్లు పరిపాలించిన ఈ ప్రాంతం చరిత్ర పుటల్లో నిలిచిపోయిందన్నారు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. రామతీర్థంగా పేరుగాంచిన కోనేటిలో భక్తులు సంప్రదాయంగా మునిగి తమ మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం ఉదయం నుంచి వర్షం కురువడంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలకు అడ్డు తగిలినప్పటికీ వర్షంలోనే కార్యక్రమాలను నిర్వహించారు.

ఆర్డీటీ అభిమానుల ర్యాలీ

గోరంట్ల, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని కోరుతూ సంస్థ అభిమానులు, మహిళలు సోమవారం పట్టణంలో ర్యాలీ చేశారు. పలుగ్రామాల మహిళలు పట్టణ ప్రధాన రహదారిపై తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగించారు. పేదలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి ఆర్డీటీ ఎంతో కృషి చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్రం ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అనంతరం తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందించారు.

పోస్టర్ల విడుదల

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి నివారణకు అవగాహన కార్యక్రమం, పోస్టర్ల విడుదల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ క్యాంపెయిన్ సౌజన్యంతో సోమవారం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, అధ్యాపకులు ధనలక్ష్మి, హిమబిందు, తిప్పేస్వామి, కుమార్, మంజుల పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

రొద్దం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్ కొట్టాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చంద్రమౌళి అనారోగ్యంతో బాధ పడుతుండగా నాయకులు చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల కాలికి ఆపరేషన్ చేయించుకుని ఇంటికి తిరిగిరాగా సోమవారం ఆయనను టీడీపీ నాయకులు పరామర్శించారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పెనుకొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ క్షయవ్యాధి నివారణ పథకంలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం క్షయ రోగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. టీబీ యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ శశిధర్, రెడ్డమ్మ, చంద్ర, నూర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మడకశిర టౌన్, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మంగళవారం మడకశిర పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్స్‌తో సమావేశం, 11 గంటలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ, 11.30 క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకుల తో సమావేశం ఉంటుందన్నారు.

మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌కు సన్మానం


చైర్మన్లను సన్మానిస్తున్న సోమందేపల్లి నాయకులు

సోమందేపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ శైలజా వెంకటేశ్‌కు సోమవారం టీడీపీ స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. పెనుకొండ మార్కెట్‌యార్డ్‌లో మంత్రి సమక్షంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్లు, సింగిల్ విండో అధ్యక్షులు, డైరెక్టర్లకు సామూహిక ప్రమాణస్వీకారం నిర్వహించారు. అనంతరం సోమందేపల్లి మండలం నడింపల్లికి చెందిన చైర్మన్ శైలజ, కన్వీనర్ వెంకటేశుకు నాయకులు సూర్యనారాయణ, కిష్టప్ప, అంజి, తదితరులు శాలువలు కప్పి సత్కరించారు.

సింగిల్‌విండో చైర్మన్‌గా రవిమోహన్ ప్రమాణస్వీకారం


రవిమోహన్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

గోరంట్ల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనివారిపల్లి సింగల్‌విండో అధ్యక్షుడిగా సీనప్పపల్లికి చెందిన రవిమోహన్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. డైరెర్లుగా రంగప్ప, రామచంద్ర బాధ్యతలు చేపట్టారు. రవిమోహన్‌తోపాటు డైరెక్టర్లను టీడీపీ నాయకులు శాలువ, పూలమాలతో సత్కరించారు. చంద్ర, నరసింహమూర్తి, ఉమాశంకర్, మనోహర్, హరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

హోంమంత్రి పరమేశ్వర్ క్షమాపణ చెప్పాలి

పావగడ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర హోంమంత్రి జి.పరమేశ్వర్ యావత్ జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని ఆ సంఘం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. హోంమంత్రి తుమకూరు నగరంలో జర్నలిస్టులు లేనిపోనివి రాసి ప్రభుత్వాలకు చెడ్డపేరు తెస్తున్నారని, ఏదన్నా రాయాలంటే తమ దృష్టికి తీసుకురావాలని, లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన చేసిన వ్యాఖ్యలు అనుచితమైనవన్నారు.మంచి రాసేటప్పుడు ఏమీ అనరని, తప్పులను ఎత్తిచూపితే తమపై బురదజల్లుతున్నారని జర్నలిస్ట్ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఆగివున్న లారీని ఢీకొన్న కారు


ప్రమాదంలో నుజ్జయిన కారు

పెనుకొండ రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని పులేకమ్మ ఆలయంవద్ద ఆగివున్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సోమందేపల్లికి చెందిన నలుగురు వ్యక్తులు సోమవారం కారులో పెనుకొండవైపు వెళ్తున్నారు. జాతీయరహదారిపై పులేకమ్మ ఆలయం సమీపంలో ఆగివున్న లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొలెరో బోల్తా

పరిగి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడికొండ-శిర హైవేలో బొలేరోవాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొని బోల్తాపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు కొడికొండ వైపు నుంచి రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్టకు కూలీ పనులు ముగించుకుని బొలేరోలో వెళ్తుండగా పరిగి నుంచి చిన్నపల్లి క్రాస్‌వద్ద ద్విచక్రవాహనం అడ్డురావడంతో ఢీకొని వాహనం బోల్తాపడింది. ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మండ్లి కిషోర్, బొలేరోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మందిలో నలుగురు గాయపడ్డారు.వారిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు కోసం స్థానికులు తరలించారు.

'సాగు భూములకు పట్టాలివ్వండి'


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

సోమందేపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సాగు భూములకు పట్టాలివ్వాలని తుంగోడు పంచాయతీ రైతులు ధర్నాకు దిగారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. సర్వేనంబరు 28లో 1051ఎకరాలు ప్రభుత్వ భూములుండగా కొన్నేళ్ల నుంచి 150మంది రైతులు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. ఎనిమిదో విడత భూపంపిణీలో తమకు పట్టాలు అందిస్తామని చెప్పి అధికారులు నిలిపివేశారన్నారు. గత యేడాది రెవెన్యూ సదస్సులో సాగులో ఉన్న రైతులకు భూమిపై హక్కులు కల్పిస్తామని నమ్మబలికి మోసం చేశారన్నారు. ఇటీవల ప్రభుత్వం కంప్రెస్డ్‌బయోగ్యాస్ సంస్థకు భూములు కేటాయించినట్లు అధికారులు చెబుతున్నారన్నారు. తమ గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలకు సమాచారం లేదన్నారు. కనీసం గ్రామసభ నిర్వహించకుండా పంచాయతీ రిజర్వేషన్ సర్టిఫికెట్లపై సర్పంచును మభ్యపెట్టి సంతకాలు తీసుకున్నట్లు తెలిపారు. దీనిపై గతనెల కార్యాలయం ఎదుట ధర్నాకు దిగామన్నారు. సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందించామన్నారు. ఈ దిశలో ఆర్డీఓ ఆనంద్ కుమార్ ద్వారా తహసీల్దార్‌కు తాకీదులు అందాయన్నారు. సోమవారం కాలనీ వద్దకు రావాలని ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతికి ఆహ్వానించామన్నారు. ఈలోపే భూమి చదును పనులు సంస్థనిర్వాహకులు చేపట్టడంతో వాటిని తాము అడ్డుకుని వెనుక్కు పంపామన్నారు. తమకు న్యాయం జరిగేంతవరకు కార్యాలయం వద్దనుంచి కదిలేది లేదన్నారు. తహసీల్దార్ మారుతిని వివరణ కోరగా తాను కార్యాలయం వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తుంగోడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడం సీఎంకే సాధ్యం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేసామి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి, నాయకులు

మడకశిర టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలంటే సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి అన్నారు. సోమవారం బాలాజీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో అగళి మండలం అలూడి, అలూడి కొమర్లెపల్లి గ్రామానికి చెందిన 100 కుంటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వారికి పార్టీ కండువాలు వేసి గుండుమల ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజల నుంచి మంచి లభిస్తోందన్నారు. గత వైసీపీ ఐదేళ్లకాలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు అధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అనేక మంది పార్టీలోకి రావడానికి మొగ్గు చూపుతున్నారన్నారు. కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ నాగరాజు, తిప్పేస్వామి, రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ లక్ష్మీనారాయణ, సింగల్ విండో అధ్యక్షుడు కుమార్‌స్వామి, జడ్పీటీసీ ఉమేష్, బసవరాజు, నరసింహప్ప, శివకుమార్ పాల్గొన్నారు.

రైతు సదస్సుకు తరలిన టీడీపీ నాయకులు


ట్రాక్టర్ ర్యాలీకి బయల్దేరిన పరిగి మండల నాయకులు

రొద్దం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పెనుకొండలో జరిగిన రైతు సదస్సుకు రొద్దం మండలం నుంచి టీడీపీ నాయకులు తరలివెళ్లారు. సోమవారం మార్కెట్‌యార్డ్‌లో అన్నదాత సుఖీభవ నిధులు పడినందుకు ట్రాక్టర్‌ర్యాలీ, మార్కెట్‌యార్డ్ చైర్మన్, డైరెక్టర్, సింగిల్‌విండో అధ్యక్షుల ప్రమాణస్వీకారం జరిగింది. మండలం నుంచి వందలాది ట్రాక్టర్లు రైతు సదస్సు ర్యాలీకి తరలి వెళ్లాయి. నరహరి, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, శ్రీనాథ్‌చౌదరి, వీరాంజనేయులు, సిద్దన్న, తిరుపాల్‌నాయుడు పాల్గొన్నారు.

పరిగి: మండలం నుంచి పెనుకొండలో నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీకి స్థానిక టీడీపీ నాయకులు తరలివెళ్లారు. సోమవారం పెనుకొండలోని మార్కెట్‌యార్డ్‌లో చైర్మన్, డైరెక్టర్, సింగిల్‌విండో అధ్యక్షుల ప్రమాణస్వీకారం జరిగింది. పరిగి మండలం నుంచి వంద ట్రాక్టర్లలో రైతు సదస్సుకు సోమందేపల్లి నుంచి ర్యాలీగా తరలి వెళ్లారు. కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, ప్రవీణ్‌రెడ్డి, సోమప్ప, వెంకటేశ్, డీఎస్ఎల్ శ్రీనివాసులు, దొడ్డయ్య పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు: బీఎస్పీ


పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

హిందూపురం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట నాగరాజు అన్నారు. సోమవారం బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని కలెక్టరేట్‌వద్ద ధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీంతో ముందస్తుగానే పోలీసులు పుట్టపర్తికి వెళ్లకుండా అడ్డుకున్నారు. బీఎస్పీ నాయకులను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాగరాజు మాట్లాడుతూ శాంతియుతంగా బహుజనులకోసం నిరసన తెలపడానికి వెళ్తుంటే పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. ఇలాంటి అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. శ్రీరాములు, రామాంజనేయులు, ఈశ్వరయ్య, సుబ్బరాయప్ప, మౌలాలీ, హుస్సేన్, గంగప్ప పాల్గొన్నారు.

సమాజానికి సైన్స్ అవసరం: మున్సిపల్ చైర్మన్


బహుమతులు అందుకున్న విద్యార్థులతో మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సమాజానికి సైన్స్ అవసరమని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. సోమవారం సరస్వతి విద్యాపీఠంలో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో చైర్మన్ పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి సైన్స్ మూలమని మానవమనుగడకు ఎంతో ఉపయోగకరమన్నారు. విద్యార్థులు సాంకేతికంగా ఎదగాలని, ప్రతి ఆలోచనను కొత్తగా రూపొందించుకోవాలన్నారు. సరస్వతి పీఠం సభ్యులు సత్యనారాయణరెడ్డి, శ్రీకాంత్, ప్రకాశ్, గోవిందరాజులు, హేమావతి, రాధాకృష్ణ, రమేష్, పార్థసారథి, కళ్యాణ్ పాల్గొన్నారు.

బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్

పెనుకొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీకి సంబంధించి ఒక బార్ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌కుమార్ తెలిపారు. బార్ కాలపరిమితి మూడేళ్లు ఉంటుందని సెప్టెంబరు 1 నుంచి 2028అక్టోబరు 31వరకు గడువు ఉంటుందన్నారు. సంవత్సర కాలానికి రూ.35లక్షలు లైసెన్స్ ఫీజు ఆరు విడుతలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో అప్లికేషన్‌కు రూ.5లక్షలు నాన్‌రిఫండబుల్ రుసుంతోపాటు ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కనీసం నాలుగు అప్లికేషన్లు రావాలన్నారు. అప్లికేషన్ దాఖలుకు చివరి తేదీ 26 సాయంత్రం 6గంటల వరకు ఉంటుందన్నారు. డ్రా తీసేస్థలం సాయిఆరామం పుట్టపర్తిలో 28న ఉదయం 8గంటలకు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారందరూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పుట్టపర్తి ఎక్సైజ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు పెనుకొండ ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.